

ప్రతి ఏటా వ్యవసాయ జూదంలో.. శ్రమ, పరువు, డబ్బు పోగొట్టుకుంటున్న జిల్లా రైతుల అవస్థలు చూసైనా ఆ వానదేవునికి జాలి కలిగినట్లు లేదు. మబ్బులు పట్టి వర్షం కురిసేలా ఉన్నా.. అవి చినుకులా మారకుండా వెళ్లిపోతున్నాయి. మేఘాలు దోబూచులాడుతున్నాయే కానీ వాన చినుకు జాడ మాత్రం లేదు. ఏదో మొక్కుబడిగా బతకనీయక.. చావనీయక అనే రీతిలో భూమి తడిసేలా వానలు పడుతున్నాయి. పడుతున్న వానలను చూసి పంటలు సాగు చేసే ధైర్యం చేయలేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఖరీఫ్ మొదలైనప్పటి నుంచి సరైన వానలు లేక జిల్లాలోని వేలాది చెరువులు, కుంటలు చుక్కనీళ్లు లేక నోర్లు తెరిచాయి. వర్షాధారంగానే పంటలు సాగు చేయాల్సి ఉండడంతో నీటి వసతి లేక వేలాది ఎకరాలు సాగుకు అనువైన భూములు బీళ్లుగా మారిపోయాయి. దీంతో ఖరీఫ్‌లో అనుకున్న మేర పంటలు సాగు చేసి వ్యవసాయ పనుల్లో క్షణం తీరిక లేకుండా గడపాల్సిన రైతు కంట కన్నీరు కారుతోంది. అడపాదడపా వర్షాలు పడుతున్నా చెరువులు, కుంటలు నిండే స్థాయిలో పడకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

జాలి చూపని వానదేవుడు..

- దోబూచులాడుతున్న మేఘాలు
- వర్షం పడక నోర్లు తెరిచిన చెరువులు, కుంటలు
- బీళ్లుగా వేల ఎకరాలు..
- అన్నదాత కంట కన్నీరు..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా వర్షాధారంగానే వ్యవసాయం చేస్తారు. జిల్లాలో అన్నమయ్య, పింఛా, వెలిగల్లు, ఝరికోన, నిమ్మనపల్లె, మేడికుర్తి ప్రాజెక్టులు ఉన్నాయి. అయితే ఇందులో అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులు రెండున్నర సంవత్సరాల కిందట వరదలకు కొట్టుకుపోయాయి. మిగిలిన ప్రాజెక్టులు పేరుకు మాత్రమే ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రస్తుతం కనీసం ఒక ఎకరాకు కూడా నీళ్లు ఇచ్చే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో జిల్లా రైతాంగానికి చెరువులు, కుంటలే ఆధారంగా నిలుస్తున్నాయి. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో సుమారు 7 వేలకు పైగా కుంటలు, చెరువులు ఉన్నాయి. వీటిలో కొన్ని చాలా పెద్ద చెరువులు ఉండగా వాటి కింద వందల ఎకరాల ఆయకట్టు ఉంది. స్థానికంగా ఉండే ఈ చెరువులు, కుంటలు, నీటి గుంతలే రైతులకు ఉపయోగపడుతున్నాయి. రుతుపవనాలో..? తుఫాన్ వల్లనో? చెరువులు, కుంటలు నిండితే.. ఎంత లేదన్నా.. రెండు, మూడు సంవత్సరాల పాటు.. వర్షాలు లేకపోయినా.. పంటలు పండించుకోగలుగుతారు. అయితే రెండు సంవత్సరాలుగా ఆశించినంత స్థాయిలో వర్షాలు పడలేదు.



చిన్నమండెం మండలంలో ఎండిపోయిన వరి

వెంటాడుతున్న లోటు వర్షపాతం

జిల్లాను కొంతకాలంగా వర్షపాత లోటు వెంటాడుతోంది. సగటున కురవాల్సిన దాని కంటే తక్కువగానే వర్షాలు పడుతున్నాయి. 2021లో తుఫాన్ కారణంగా వచ్చిన వరదల తర్వాత చెప్పుకోదగ్గ స్థాయిలో వానలు పడలేదు. ఈ ఏడాది కూడా ఖరీఫ్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు చూస్తే వర్షపాతం లోటు స్పష్టంగా కనిపిస్తోంది. జూన్‌లో మాత్రమే సాధారణ స్థాయి కంటే ఎక్కువగా వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 75.1 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 160.6 మిల్లీమీటర్లు కురిసింది. జూలైలో 90.5 మి.మీ కురవాల్సి ఉండగా 47.5 మాత్రమే కురిసింది.



నీళ్లు లేక ఎండిపోయిన రామసముద్రంలోని గుంటలపేట చెరువు

ఆగస్టులో 28 మండలాల్లో చిన్నపాటి వర్షం కురిసింది. రెండు మండలాల్లో చుక్క వాన పడలేదు. ఇందులో కూడా ఎక్కువగా వాన పడిన మండలాలు 10 ఉండగా సాధారణ వర్షం 16 మండలాల్లో, తక్కువగా 4 మండలాల్లో కురిసింది. గణాంకాలు చూస్తే జూన్ నుంచి వర్షం పడినట్లే కనిపిస్తుంది. అయితే చెప్పుకోతగ్గ స్థాయిలో ఒకసారి కూడా వానలు పడలేదు. దీంతో చెరువులు, కుంటల్లోకి చుక్కనీళ్లు రాలేదు. ఎక్కడ చూసినా చుక్క నీళ్లు లేక ఇంకిపోయాయి.

గణనీయంగా తగ్గిన సాగు

నీటి వసతులు లేకపోవడంతో ఈసారి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది. వరి సాధారణ సాగు 10,037 ఎకరాలు ఉండగా ఇప్పటికి 4504 ఎకరాల్లో మాత్రమే సాగైంది. వేరుశనగ 42,852 ఎకరాలు సాధారణ సాగు కావాల్సి ఉండగా 10809.2 ఎకరాలు మాత్రమే రైతులు సాగు చేశారు. మిగిలిన అన్ని పంటలు కలుపుకుని 65,386 ఎకరాలకు గానూ 17,978.2 ఎకరాలు మాత్రమే సాగుకు నోచుకున్నాయి. సాగైన వరి, వేరుశనగ పంటలు కూడా ప్రస్తుతం ఎండిపోతున్నాయి. కొద్దోగొప్పో పడుతున్న వర్షాలు నామమాత్రంగానే రైతులకు ఊరటనిస్తున్నాయి. పలుచోట్ల కనీసం పశువుల మేత కూడా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో చెరువులు, కుంటలపైనే ఆధారపడిన రైతులు వానదేవుడిపైనే భారం వేసి ఎదురు చూస్తున్నారు.

వాన కోసం ఎదురు చూస్తున్నా

- రమణ, గంగిరెడ్డిగారిపల్లె, చిన్నమండెం



రెండు ప్యాకెట్ల జిలకర మసూర వడ్లు తెచ్చి నారు సిద్ధం చేసుకుని వర్షం కోసం ఎదురు చూశా. వానలు లేక వరి నార్లు ఎండిపోయాయి. వరి నాటుకునేందుకు కూడా వానసాయం చేయలేదు. మా గ్రామంలో చాలామంది వరి నార్లు ఎండిపోయి తిండి గింజలకు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. చాకిబండ చెరువు నిండితే దాదాపు చాకిబండ, మల్లూరు, వండాడి గ్రామ పంచాయతీల పొలాలకు సాగునీరు అందుతుంది. వానలు సక్రమంగా పడకపోవడంతో బోరుబావుల కింద భూములు పూర్తి స్థాయిలో బీళ్లుగా ఉన్నాయి. కనీసం పశువుల మేతకు కూడా నీరు లేక చాలామంది పశువులను అమ్ముకుంటున్నారు. వేరుశనగ విత్తనకాయలు ఒలిచి వేయలేక చాలామంది గింజలు అమ్ముకున్నారు. ఒకరిద్దరు గింజలు వేసినా.. ఊడగలు దిగే సమయంలో వర్షాలు లేక ఊడగలన్నీ ఎండిపోయాయి.

చెరువులు నిండలేదు

- నారాయణరెడ్డి, గుంటలపేట, రామసముద్రం



రామసముద్రం మండలంలో చెరువుల కింద 4660 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. ఇందులో మూడవ వంతు భూమిలో వర్షాకాలంలో వరి సాగు చేసేవాళ్లు. అయితే గత ఏడాది, ఈ ఏడాది వర్షాలు లేక చెరువుల్లో నీళ్లు లేక వెలవెలపోతున్నాయి మా గ్రామంలో గుంటలపేట చెరువు ఆయకట్టు కింద మూడు ఎకరాల పొలం ఉంది. అయితే రెండు సంవత్సరాలుగా వర్షాలు లేక చెరువు నిండలేదు. దీంతో భూమి సాగులేక బీడుగా ఉంది. చెరువు నిండితే కానీ పంటలు సాగు చేయలేము. నాలుగేళ్ల క్రితం వర్షాలు బాగా పడి చెరువు నిండడంతో మొత్తం మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఇప్పుడు వర్షాభావంతో పంట సాగు లేక జీవనానికి ఇబ్బంది పడుతున్నాము.

ఇళ్లకు వెళ్లిపోయారు...

- ఇలాంటి పాఠశాలలో మా పిల్లలకు చదువొద్దు
- విద్యార్థినులను ఇళ్లకు తీసుకెళ్లిపోయిన తల్లిదండ్రులు
- మూతపడ్డ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల



తమ పిల్లలను ఇంటికి తీసుకెళుతున్న తల్లిదండ్రులు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 3: ఇలాంటి పాఠశాలలో మా పిల్లలను చదవనీయమని, ఇక్కడ ఉండాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల నుంచి ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. దీంతో మంగళవారం పాఠశాలకు తాళాలు పడ్డాయి. లక్కిరెడ్డిపల్లెలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం బాలికపై లైంగిక దాడి సంఘటనతో గురుకుల పాఠశాలలో ఉన్న విద్యార్థినులు భయభ్రాంతులకు గురయ్యారు. 5వ తరగతి విద్యార్థినిపై జరిగిన లైంగిక వేధింపులను వసతి గృహంలో ఉన్న విద్యార్థినులు జీర్ణించుకోలేక, హాస్టల్‌లో ఉండలేక తమ తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇలాంటి పాఠశాలలో ఉండనీయమని మంగళవారం 470 మంది విద్యార్థినులను వారి తల్లిదండ్రులు వచ్చి ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. దీంతో పాఠశాల మూతపడింది. ఈ విషయంపై విద్యార్థినుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇలాంటి క్రూరమైన ప్రిన్సిపాల్ ఉన్న ఈ పాఠశాలలో మా పిల్లలను చదివించలేమని తెలిపారు. అందరూ పల్లెటూర్ల నుంచి చదువుకోవడానికి వచ్చిన పిల్లలని ఇలాంటి పిల్లలను ఇలా మానసికంగా, లైంగికంగా వేధించడం మంచిది కాదన్నారు. ఇలాంటి ప్రిన్సిపాల్, ఆమె భర్తకు కఠిన శిక్ష విధించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.



మూతపడ్డ అంబేడ్కర్ గురుకుల పాఠశాల

విజయవాడలో జిల్లా పోలీసులు

- వరద సహాయక చర్యల్లో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



మోకాటి లోతు నీటిలో బాధితుల వద్దకు వెళుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జిల్లా పోలీసులు

రాయచోటి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరదల్లో చిక్కుకున్న బాధితులకు సాయం అందించేందుకు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో జిల్లా నుంచి పోలీసుల బృందం విజయవాడకు వెళ్లింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి హుటాహుటిన ఈ సహాయక బృందం విజయవాడకు చేరుకుంది. అక్కడి సింగ్‌నగర్ కాలనీ, సితార సెంటర్‌లో బాధితులకు ఆహారం, నీరు, నిత్యావసర వస్తువులను అందిస్తున్నారు. మోకాటి లోతు నీళ్లలో ఎస్పీ స్వయంగా వరద ప్రాంతాలలో బాధితుల వద్దకు వెళుతూ బృందాన్ని ముందుండి నడిపిస్తున్నారు. ఈ సహాయక బృందంలో జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, సివిల్, ఏఆర్ పోలీసులు, హోంగార్డులు ఉన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- సిమెంట్ లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం
- సిమెంటు లారీ దగ్ధం... యువకుడు మృతి

ప్రమాదంలో కాలిపోయిన సిమెంటు లారీ



బి.కొత్తకోట, సెప్టెంబరు 3: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కడప జిల్లా యర్రగుంట్ల నుంచి బయలుదేరిన సిమెంటు లారీ బి.కొత్తకోట శివారులోకి రాగానే ఎదురుగా ద్విచక్రవాహనంలో వచ్చిన ఓ యువకుడు నేరుగా లారీ ముందు భాగంలో ఢీకొన్నాడు. ద్విచక్రవాహనం లారీ ముందు ఇరుక్కుపోయింది. యువకుడితో సహా ద్విచక్రవాహనాన్ని సిమెంటు లారీ సుమారు 100 మీటర్ల దూరం లాక్కెళ్లింది. ఈ రాపిడికి ద్విచక్రవాహనంలోని పెట్రోల్ ట్యాంక్ నుంచి మంటలు అంటుకున్నాయి. అవే మంటలు లారీకి కూడా వ్యాపించడంతో లారీడ్రైవర్ కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. లారీ క్యాబిన్ మొత్తం కాలిపోయింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసుల విచారణలో మృతుడు పీలేరు బెస్తపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమారుడు బెస్త మహేశ్(25)గా గుర్తించారు. తాపీ మేస్త్రీగా పీటీఎం మండలం సొన్నువారిపల్లెకు చెందిన ఓ మేస్త్రీ ఆధీనంలో పనిచేస్తున్నాడు. ఇతడికి స్థానిక ఇందిరమ్మ కాలనీలో నివాసం ఏర్పాటు చేశారు. బి.కొత్తకోట నుంచి ఇందిరమ్మ కాలనీకి వస్తున్న క్రమంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.



మృతుడు మహేశ్ (ఫైల్)

వైభవంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు

- అంకురార్పణతో ప్రారంభం

ఒంటిమిట్ట, సెప్టెంబరు 3: ఒంటిమిట్ట కోదండరామాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న పవిత్రోత్సవాలను మంగళవారం సాయంత్రం అంకురార్పణతో టీటీడీ అర్చకులు ప్రారంభించారు. ముందుగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, యజ్ఞోపవీతరణ శాస్త్రీయంగా నిర్వహించి అనంతరం హోమం చేశారు. బుధవారం స్వామి వారికి పవిత్రాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కోదండరామాలయంలో స్వామి వారికి నిత్యకైంకర్యాలలో జరిగే పొరపాట్లను, మానవ తప్పిదాలతో జరిగే తప్పులను సరిదిద్దేందుకు పవిత్రోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించడం వైష్ణవ ఆలయాల్లో ఆనవాయితీగా కొనసాగుతోందని టీటీడీ అర్చకులు తెలిపారు.



పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న టీటీడీ అర్చకులు

అంబేడ్కర్ గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తాం : మంత్రి

సంబేపల్లె, సెప్టెంబరు 3: అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం దేవపట్ల బాలయోగి బాలికల గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను బోధించాలని, మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్ల వసతి కల్పించాలని ఈ సందర్భంగా విద్యార్థినులు మంత్రికి తెలిపారు. విద్యార్థినుల సౌకర్యార్థం జనరేటర్ అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె సంఘటన పునరావృత్తం కాకూడదు

లక్కిరెడ్డిపల్లె అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం జరిగిన సంఘటన ఎక్కడా పునరావృత్తం కాకూడదని మంత్రి పాఠశాల సిబ్బందికి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె సంఘటనకు బాధ్యులైన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమె భర్తపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. ఏదో ఒకచోట జరిగిన తప్పుతో వ్యవస్థలను నిందించడం తగదన్నారు. అన్నిచోట్లా మంచి వారు కూడా ఉంటారని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల కోసం ఈ గురుకులాలను స్థాపించినట్లు తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. దేవపట్ల గురుకుల పాఠశాలలో డార్మెటరీ నిర్మాణంలో జాప్యం జరగడంతో ఇప్పటి వరకు పని జరిగిన దానికి బిల్లులు చెల్లించి కొత్త వారికి కాంట్రాక్ట్ ఇచ్చేలా చూస్తామన్నారు. ఉపాధ్యాయ సమస్యలతో పాటు విద్యార్థినుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శశికళ, మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, నాయకులు గాజుల ఖాదర్‌బాష, విష్ణువర్ధన్‌రెడ్డి, బయ్యారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కుంచపు రెడ్డెయ్య, ఖాదర్‌హుసేన్, అల్లాంషా తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంతోషమే సీఎం లక్ష్యం

- నాలుగేళ్ల తర్వాత ఒంటిమిట్ట చెరువుకు నీరు
- రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 3: రాష్ట్రంలో రైతుల సంతోషమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. మంగళవారం సాయంత్రం సోమశిల వెనుకజలాల నుంచి ఒంటిమిట్ట చెరువుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని మూలనపడేసిందని తెలిపారు. ఒంటిమిట్ట చెరువుకు నీటి విడుదల గురించి కడప జిల్లా కలెక్టర్ శివశంకర్‌తో మాట్లాడటంతో నిధులు కేటాయించడంతో పాటు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. దీంతో ఈఈ వెంకటరామయ్య, డీఈ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో నిపుణులను రప్పించి పైపులకు మరమ్మతులు చేపట్టారన్నారు. విద్యుత్ సరఫరాలో సాంకేతికలోపం ఉండడంతో విద్యుత్ అధికారులు వెంటనే మరమ్మతులు చేయడంతో మంగళవారం సాయంత్రం ఎట్టకేలకు ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనక జలాలు చేరాయి. విషయం తెలుసుకున్న మండల రైతాంగం పెద్దఎత్తున ఎత్తిపోతల పథకం పైపులైను వద్దకు వచ్చి ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రజల ప్రభుత్వమని, మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని జగన్‌మోహన్‌రాజు అన్నారు. రాష్ట్ర గుర్తింపు పొందిన కోదండరామాలయం వద్ద ట్యాంకర్ల ద్వారా భక్తులకు నీటిని సరఫరా చేస్తుండడం బాధాకరమని వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చొరవ తీసుకున్నానని, ప్రభుత్వ నిధులతో పాటు తన సొంత నిధులను కూడా వెచ్చించి రైతులకు నీరు అందించాలని పట్టుదలతో పనిచేశానని తెలిపారు. అనంతరం నీటి వద్ద హారతి ఇచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక టీడీపీ నాయకులు, ఇరిగేషన్ ఈఈ వెంకటరామయ్య, డీఈ వాసుదేవరెడ్డి, టీడీపీ నాయకులు వెంకటనరసయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, రేవిళ్ల బాలమునెయ్య, మోదుగుల నరసింహులు, కత్తి అయ్యవారయ్య, హరినాథరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.



చెరువులోకి వస్తున్న సోమశిల వెనుక జలాలకు హారతి ఇస్తున్న టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న వైస్‌చాన్సలర్ విశ్వనాథకుమార్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 3: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వైస్‌చాన్సలర్ విశ్వనాథకుమార్ తెలిపారు. మంగళవారం కడప నగరం యూనివర్శిటీ ఆవరణలో సమ్మరిటన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అమ్మపేరుతో ఒక మొక్క అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు కనీసం అమ్మ పేరు మీద ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీఎస్ ప్రిజర్వేర్ సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్, యూనివర్శిటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ రమాదేవి, వరలక్ష్మి, స్టెప్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించవద్దు...

● నాన్ టీచింగ్ స్టాఫ్ ఉద్యోగుల వేడుకోలు



నిరసన వ్యక్తం చేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్

చెన్నూరు, సెప్టెంబరు 3: వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో పనిచేస్తున్న తమను తొలగించడం అన్యాయమని.. ఉద్యోగాల్లో కంటిన్యూ చేయకపోతే మా కుటుంబాలు వీధిన పడతాయంటూ నాన్ టీచింగ్ స్టాఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమను ఆ యూనివర్సిటీ వీసీ తొలగిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం యూనివర్సిటీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్‌కు చెందిన షేక్ రబీవుల్లా మాట్లాడుతూ తమను ఈ ఏడాది మార్చిలో అవుట్‌సోర్సింగ్ కింద 47 మందిని తీసుకున్నారని, అయితే జూలై వరకు జీతాలు చెల్లించి ఆగస్టులో తొలగిస్తున్నామని చెప్పడం దారుణమన్నారు. తామంతా పేదలమని, మాలో కొందరు వికలాంగులు ఉన్నారన్నారు. పనిచేస్తేనే తమ జీవితాలు గడుస్తాయని.. ఏ కారణం చూపించకుండా తమను తొలగిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. వైవీయూ, డాక్టర్ బీఆర్ యూనివర్శిటీ, పులివెందుల, కడప రిమ్స్ కళాశాలలో తమలాగే ఉద్యోగులు పనిచేస్తున్నా వారిని తొలగించలేదని.. కేవలం ఇక్కడ మాత్రమే తొలగించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఇంటర్వ్యూద్వారా ఈ ఏడాది మార్చి 15న తీసుకున్న తమను ఇలా తీసేస్తామని చెప్పడం తగదని.. ఈ విషయంలో తాము ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రతాలు పంపుతామని తెలిపారు.

తైక్వాండో పోటీల్లో జిల్లాకు బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న నాగేంద్రబాబు

కడప (స్పోర్ట్స్), సెప్టెంబరు 3 : తిరుపతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ పురుషుల, మహిళల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఎస్.నాగేంద్రబాబు బంగారు పతకం సాధించాడు. అండర్ 87 కేజీల విభాగంలో విజేతగా నిలిచి బంగారు పతకం అందుకున్నారు. దీంతో త్వరలో పాండిచ్చేరిలో జరగనున్న నేషనల్ పోటీలకు నాగేంద్రబాబు అర్హత సాధించారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


● షార్ట్‌సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు ● మూడు బైకులు దగ్ధం



షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన బైకులు

కడప (క్రైం), సెప్టెంబరు 3: కడప నగరం కోఆపరేటివ్ కాలనీలోని సిటీ యూనియన్ బ్యాంకు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. మంటలు ఎగిసి పడటంతో బ్యాంకు వద్ద పార్క్ చేసి ఉన్న బైకులకు నిప్పంటుకుంది. దీంతో మూడు బైకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు కడప ఫైర్ అధికారులు, వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాధరెడ్డిలు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఫైర్ అధికారులు మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే మంటలు చెలరేగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిపోయినట్లయ్యింది. కాలిపోయిన బైకులు ఇద్దరు బ్యాంకు ఉద్యోగులవి కాగా, మరో మూడు బైకులు సమీపంలో ఉన్న జిమ్‌కు వచ్చే వారివిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కడప ఫైర్ అధికారి బస్విరెడ్డి తెలిపారు. మొత్తం రూ.5లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్లు తెలిపారు.

రెండు స్కూటీలు ఢీ...ఒకరు మృతి



శ్రీనివాసులరెడ్డి మృతదేహం

ముద్దనూరు సెప్టెంబరు 3: మండల పరిధి కడప, తాడిపత్రి జాతీయ రహదారిలోనియామవరం సచివాలయం సమీపంలో మంగళవారం రెండు స్కూటీలు ఢీకొన్న ప్రమాదంలో శ్రీనివాసులరెడ్డి (50) మృతి చెందినట్లు ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.చింతకుంట గ్రామానికి చెందిన శ్రీనివాసులరెడ్డి ఆయన సోదరుడు రామాంజులరెడ్డి స్కూటీలో పని నిమిత్తం ముద్దనూరుకు వస్తున్నారు. యామవరం గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి అతివేగంగా వచ్చి ముందు వెళుతున్న స్కూటీని అతివేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో స్కూటీలోని శ్రీనివాసులరెడ్డి రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయమైంది. వెంటనే ముద్దనూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా మృతి చెందాడు. మృతుని సోదరుడు రామాంజులరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మూడు ట్రాక్టర్లు సీజ్

వేంపల్లె, సెప్టెంబరు 3: వేంపల్లె పాపాఘ్ని నది నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. అందిన సమాచారంతో సోమవారం రాత్రి దాడులు చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని.. స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించామని తెలిపారు.

అరటికి.. వైరస్ పోటు

● ఎన్ని మందులు పిచికారి చేసినా... ఫలితం లేదంటున్న రైతులు

● ఉద్యాన కళాశాల ఆచార్యుల బృందం పరిశీలన

● శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలి



తెగులు సోకిన అరటి మొక్క



తెగులు సోకిన అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన కళాశాల ఆచార్యులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 3: అరటి పంటకు వైరస్ ఆశించింది. ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం అరటి పంటకు పెట్టింది పేరు. రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాలలో అరటి పంటను సుమారు 20 వేల హెక్టార్లలో పండిస్తున్నారు. ఇటీవల కాలంలో అరటి కాయలకు మంచి డిమాండు (కిలో రూ.20 నుంచి రూ.25లకు)తో పాటు ఆశించిన దిగుబడులు రావడంతో అరటి రైతులకు సిరులు కురిపించాయి. అయితే ప్రస్తుతం అరటి పంట ఎత్తివేసి మళ్లీ అరటి పిలకలను రైతులు కొత్తగా నాటారు. నాటిన నెల రోజులకు వైరస్ సోకడంతో మందులు పిచికారి చేసున్నారు. అయితే ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరటి ఆకులు వైరస్ దెబ్బకు స్వభావం మారుతున్నాయి. ప్రధానంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో గ్రాండ్-9, అమృతపాణి, సుగంధాలు, ఎర్ర అరటి రకాలను రైతులు పండిస్తున్నారు. ఇటీవల రైతుల వినతుల మేరకు అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆచార్యుల బృందం రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట, ఉర్లగట్టుపోడు తదితర ప్రాంతాల్లో వైరస్ సోకిన పంటలను పరిశీలించారు. అరటికి స్ట్రీక్ వైరస్ సోకిందని నిర్ధారించారు.

వైరస్ వ్యాప్తి.. యాజమాన్య పద్ధతులు

వైరస్ తెగులు సోకిన పిలకల ద్వారా మొక్క నాటిప్పుడు వ్యాప్తి చెందుతుంది. అంతే కాకుండా మొజాయిక్, పేనుబంక అనే రసం పీల్చు పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. పిండిపురుగుల (స్ట్రీక్ వైరస్) ద్వారా వ్యాప్తి చెందుతుంది. వైరస్‌ను అరికట్టడానికి క్వారెంటైన్ పద్ధతులు ఖచ్చితంగా పాటించాలి. తెగులు సోకిన ప్రాంతం నుంచి వేరొక రాష్ట్రానికి, ప్రాంతానికి సరఫరా చేయకూడదు. తెగులు లేని దుంపలను లేదా మొలకలను పొలంలో నాటుకు వాడాలి. దుంపలను నాటే ముందు 40 డిగ్రీల వేడి గాలి ఉపయోగించుట వలన వైరస్‌ను తగ్గించుకోవచ్చు. దోస జాతి పంటలను అంతర పంటగా వేయరాదు. దోస వేసిన పొలంలో అరటిని వేయకుండా పంట మార్పిడి విధానం చేయా లి. తెగులు వ్యాప్తి చేసే రసంపీల్చే పురుగులను నివారించుటకు డైమిథోయేట్ రెండు మిల్లీలీటరు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్లు, లేదా అసిఫేట్ 1గ్రాము లీటరు నీటికి కలిపి మార్చి మార్చి 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. పొలానికి సత్తువ నిచ్చే వేపపండి లేదా ఆముదం పండి, రసాయన ఎరువులను సిఫార్సు మేరకు వాడాలి. అంతేకాకుండా సూక్ష్మదాతువుల లోపాలను నివారించుటకు మొక్కకు అందిస్తే తెగులను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది. మొలకలను పరిక్షించి రైతులు తెచ్చుకోవాలి. కురుబేల్, అలియకోల్, ఎలావెజ్ రకాల అరటి పిలకలు తెగులును తట్టుకుంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



అరటి రైతులు తెగుళ్ల వ్యాప్తిచెందినప్పుడు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలి. మొదట దశ లోనే తెగుళ్లను నివారించుకోవాలి. లేదంటే ఎక్కువ అయ్యే ప్రమాదం ఉంటుంది. తగిన సూచనల మేర కు ఎరువులు, పురుగు మందులు వాడాలి. తెగుళ్ల తగ్గలేదని రైతులు విచ్చలవిడిగా మందులు పిచికారి వేస్తే పంటలకు ఇబ్బందులు ఎదురౌతాయి. తగిన మోతాదు లోనే ఎరువులు, పురుగు మందులు ఉపయోగించాలి.

-సీహెచ్ రూత్‌బెనర్జీ, అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆచార్యులు

నాణ్యత కల్గిన పిలకలను ఎంపిక చేసుకోవాలి



నాణ్యత గల మొక్కలను ఎంపిక చేసుకోవాలి. ఎంపికలో ఎక్కడా రైతులు రాజీ లేకుండా ఉండాలి. మొక్కలు తెచ్చినప్పుడు వాటి స్థితిగతులను తెలుసుకోవాలి. మొక్కలను నాటి విధానాన్ని ముందుగా క్రమ పద్ధతిలో చేసుకోవాలి. వేరు పురుగులు ఆశించకుండా శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలి. తెగుళ్ల నివారణ కోసం ప్రత్యేక చర్యలు ముందుస్తుగా చేపట్టాలి

- కె.స్వరాజ్యలక్ష్మి, ఉద్యాన కళాశాల ఆచార్యులు

పోషకాలు అందిస్తూ, సూచనలు పాటించాలి



అరటి పంటకు పోషకాలు అందిస్తూ, సూచనలు ప్రధానంగా రైతులు పాటించాలి. పంట మార్పిడి చేసుకోవాలి. దోస పంటలు వేసి పొలాల్లో అరటి పంట వేయరాదు. వేస్తే తెగుళ్ల విచ్చలవిడిగా వ్యాప్తి చెందుతాయి. రైతులు యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటించాలి.

-వై.దుర్గ, తెగుళ్ల విభాగం పీహెచ్‌డీ విద్యార్థిని

విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 3: పర్యావరణానికి ఎలాంటి అంతరాయం లేకుండా నిబంధనలకు లోబడి కడప విమా నాశ్రయ అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం కడప విమానాశ్రయం టర్మినల్ బిల్డింగ్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఏరోడ్రమ్, ఎయిర్‌ఫీల్డ్, ఎన్విరాన్మెంట్ కమిటీల సమావేశం జరిగింది. ఈసందర్భంగా సేఫ్టీ, సెక్యూరిటీలకు సంబంధించిన పలు విషయాలను, ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు విమానాశ్రయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ చర్చించింది. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పౌర విమానయాన సేవా రంగంలో ప్రయాణికుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి ధీటుగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఆధునిక జీవన శైలికి అనుగుణంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగు పరుస్తోందన్నారు. కడప విమానాశ్రయం నుంచి భవిష్యత్తులో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని నూతన టెర్మినల్ భవన నిర్మాణానికి భారతీయ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ తగు చర్యలు చేపట్టిందన్నారు. రూ.266 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నూతన టెర్మినల్ భవన అభివృద్ధి పనుల అనంతరం కడప విమానాశ్రయం ఒక అపురూపమైన జవసత్వాలు సంతరించుకోనుందన్నారు. ఎయిర్‌పోర్టు అథారిటీ, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే, పోలీసు శాఖలు జాయింట్ కమిటీగా ఏర్పాటై.. అందుకు సంబంధించిన రోడ్లు, రవాణా వ్యవస్థ తదితర మౌలిక సదుపాయాలను పర్యవేక్షిస్తుందన్నారు. ఏపీఎస్పీఎస్‌లో భాగంగా కొరత ఉన్న సిబ్బందిని నియమించడం జరుగుతోందన్నారు. ఎయిర్‌పోర్టు పరిసరాలను శుభ్రంగా, అహ్లాదకరంగా ఉంచడంలో కడప కమిషనరు, పంచాయితీరాజ్ శాఖలు ప్రత్యేకంగా బాధ్యతలు తీసుకోవాలన్నారు. సుందరంగా తీర్చిదిద్దాలని కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, విమానాశ్రయం డైరెక్టర్, కమిటీ కన్వీనరు సుజిత్‌కుమార్, కాషో ఆనందయ్య, అదనపు మున్సిపల్ కమిషనరు రాకేష్‌చంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూఆక్రమణలపై చర్యలు తీసుకోండి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, సెప్టెంబరు 3: ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలో దేవపట్ల గ్రామంలో గంగాహోటల్ సమీపంలో 30 ఏకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఆర్డీవోతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్టపల్లె, గుడిబండ రోడ్డు మార్గంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆ భూమిలో దున్నకాలు చేపట్టడంతో వెంటనే అధికారులు స్పందించి బోర్డు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై తహశీల్దార్‌తో మాట్లాడారు. గతంలో తహశీల్దార్ ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోకపోగా.. వారికి సహకరించినట్లు తెలిపారు. దేవపట్ల గురుకుల పాఠశాల వద్ద చిన్నపీరయ్య అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతుంటే ఏఎస్ఐ అయూబ్‌ఖాన్ అడ్డుకున్నట్లు తెలపడంతో.. మిగిలిన వాళ్లను ఎందుకు అడ్డుకోలేదని ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదవాడికి ఓ న్యాయం, ఉన్నవాడికి ఓ న్యాయమా అంటూ ఆయనపై చిందులేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారు ఎంతటి వారైన చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మల్లు నరసా రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బయ్యారెడ్డి, ఖాదర్‌హుసేన్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3 : బీటెక్ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జేఎన్‌టీయూఏ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు పేర్కొన్నారు. మంగళవారం శ్రీదేవి ఫంక్షన్ హాలులో సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏ బ్రాంచ్ ఎంచుకున్నా ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. ఉత్తమ మార్కులు సాధించినప్పుడే మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. బీటెక్ విద్యార్థులకు మూడు అవకాశాలు ఉంటాయని, ఉన్నత చదువులు చదవడం, మంచి ఉద్యోగం సాధించడం, లేదా సొంత వ్యాపారం చేసే అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు గేట్ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. కళాశాల చైర్మన్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థులు వాట్సాప్, పేస్‌బుక్‌లు చూడటం వలన సమయం వృధా అని గుర్తించాలన్నారు. ర్యాగింగ్‌కు కఠిన చట్టాలు ఉన్నాయని, రాగింగ్ చేసి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని.. కోర్సు పూర్తయ్యే నాటికి రూ.12లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భారతీ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపల్ శృతి, అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ మాజీ ఎస్ఈ జీవీ వెంకటరమణ మృతి



జీవీ వెంకటరమణ

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 3: తెలుగు యువత రాష్ట్ర నాయకుడు జీవీ సారధినాయుడు తండ్రి కడప ఏపీఎస్పీడీసీఎల్ మాజీ సూపరింటెండెంట్ ఇంజినీర్ గాలివీటి వెంకటరమణ మంగళవారం తెల్లవారుజామున మరణించారు. ఆయన ఇటీవల అనా రోగ్యంతో బాధపడుతున్నాడు. 2003 నుంచి 2007 వరకు ప్రొద్దుటూరులో ఏపీ ఎస్పీడీసీయల్ డీఈగా పనిచేశారు. అలాగే 2007లో ఎస్ఈగా పనిచేస్తూ పదవీ విర మణ చేశారు. ఆయనకు విజయసారధి, విజయ భాస్కర్ కుమారులు, విజయ జ్యోతి కుమార్తె ఉన్నారు. ఈయన ఎంపీ సీఎం రమేష్ సమీప బంధువు. ఆయన అంత్యక్రియలు కదిరి తాలూకా నల్లచెరువు మండలం చిన్నఎల్లంపల్లెలో శుక్రవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు సారధినాయుడు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తాం

బీజేపీ నేతలు సాయిలోకేష్, నాగోతు రమేష్‌నాయుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు సాయిలోకేష్, నాగోతు రమేష్‌నాయుడు

రాజంపేట, సెప్టెంబరు 3: రాష్ట్రంలో బీజేపీ బలంబాగా పుంజుకుందని ఈ సమయంలో వాడవాడలా బీజేపీ సభ్యత్వ కార్యక్రమాలను ముమ్మరం చేద్దామని రాజంపేట పార్లమెంట్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడడంలో మోదీ కృషి ప్రశంసనీయమన్నారు. మూడోసారి దేశంలో బీజేపీ అధికారం చేపట్టి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశ చరిత్ర తిరగరాసిందన్నారు. బీజేపీ సభ్యత్వ కార్యక్రమాలను ప్రతి గ్రామంలో చేపట్టి ఎక్కువ మందిని పార్టీలో చేర్చుకుంటామన్నారు. వచ్చే ఎన్నికల నాటికి బీజేపీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కృష్ణ, మైనార్టీ మోర్చ నాయకులు షబ్బీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు జర్నలిస్టులే

ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ నేత జగన్‌మోహన్‌రాజు, పాల్గొన్న ఏపీయూడబ్ల్యూజే నేతలు రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులు

రాజంపేట, సెప్టెంబరు 3: ప్రభుత్వానికి, ప్రజల మధ్య వారధులు జర్నలిస్టులేనని సమాజంలోని లోపాలను, ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపి సమాజ హితం కోసం పనిచేసేది జర్నలిస్టులేనని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తోట కల్యాణ మండపంలో రాజంపేట నియోజకవర్గ తాలుకా ఏపీయూడబ్ల్యూజే ప్రథమ మహాసభ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 65 ఏళ్ల కిందట తక్కువ మందితో ప్రారంభమైన ఏపీయూడబ్ల్యూజే నేడు దేశంలోనే మొదటిస్థానంలో నిలిచిందన్నారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఇటీవలే అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో జిల్లాస్థాయి ఏపీయూడబ్ల్యూజే సమావేశాన్ని నిర్వహించామన్నారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాజంపేటలో ఏపీయూడబ్ల్యూజే మహాసభలు జరగడం ఆనందదాయకమన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టుల కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు, ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యులు బాలక్రిష్టారెడ్డి, శివరామరాజు, ఏబీఎన్ కడప స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాసులు, శ్రీనాథ్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏపీయూడబ్ల్యూజే తరపున పలువురిని సత్కరించి మెమెంటోలు అందజేశారు. శివ డ్యాన్స్ అకాడమి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

పారిశుధ్యంపై అలసత్వం వద్దు : ఈఓపీఆర్డీ

సిద్దవటం, సెప్టెంబరు 3: గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటూ పారిశుధ్య పనుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని ఈఓపీఆర్డీ పులిరాంసింగ్ సూచించారు. మూలపల్లెలో బుధవారం జరగనున్న గ్రామసభ విజయవంతంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీలో ఎక్కడా అపరిశుభ్రంగా ఉండరాదని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరి రిహాన్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

కార్యకర్తలు అసహనానికి గురికావద్దు

టీడీపీ ఇన్‌చార్జి ముక్కా స్పష్టీకరణ



కూటమి నేతలు, పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి

పెనగలూరు, సెప్టెంబరు 3: టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఎటువంటి సమస్య పైన అపోహలు పెట్టుకోవద్దని, అసహనానికి గురికావద్దని ఎమ్మెల్యే విజయానికి కృషి చేసిన ప్రతిఒక్కరినీ గుండెల్లో ఉంచుకుంటామని టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం కంబాలకుంట బీసీ కాలనీ సమీప కల్యాణ మండపంలో జరిగిన కూటమి పార్టీల కార్యకర్తల, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల తర్వాత నియోజకవర్గాన్ని ప్రజలు ఐకమత్యంతో కూటమి అభ్యర్థికి విజయం సాధించిపెట్టడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త కష్టపడితేనే ఇంతటి విజయం సాధ్యమవుతుందన్నారు. తన నాయకత్వాన్ని నమ్మి భారీ విజయాన్ని సాధించిపెట్టిన ప్రతి కార్యకర్తకు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో పెనగలూరు మండలానికి ప్రత్యేక గుర్తింపు ఇస్తానని భరోసా ఇచ్చారు. మండల ప్రజలు కోరుకునే ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారంతో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజా వ్యతిరేక విధానాలను ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా చేపట్టిన అధికారులు ఈ ప్రభుత్వంలో అలజడులు సృష్టిస్తున్నందువల్ల అభివృద్ధి ముందుకు సాగడం లేదన్నారు. ఉన్నతాధికారుల విషయంలోనే అలా ఉంటే ఇక మండలస్థాయిలో ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలన్నారు. పైస్థాయిలోనైనా కిందిస్థాయిలోనైనా గత ప్రభుత్వంలో పని చేసిన సిబ్బంది ఆ మత్తు నుంచి బయట పడలేకపోతున్నారని అటువంటి వారితో అభివృద్ధి పనులు ఎలా సాధ్యమవుతాయో మీరే ఆలోచించుకోవాలన్నారు. స్థానిక సమస్యలపై ఏకరవు పెట్టగా మండలంలోని ప్రతి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ప్రజలకు ప్రధానమైన అభివృద్ధి పనులపై సాధ్యమైనంత త్వరగా దృష్టి సారిస్తానన్నారు. సమావేశం అనంతరం మండల నలుమూలల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో మాజీ డీసీసీబీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలక్రిష్ణ, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు పేరుగు క్రిష్ణయ్యనాయుడు, నియోజకవర్గ యువత ఉపాధ్యక్షులు ఎం.రాంప్రసాద్‌నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కె.జయరామయ్య, ఎం.సత్యనారాయణ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పుచ్చకాయల రవికుమార్, కె.నాగేశ్వర్‌నాయుడు, కమ్మ సంఘం మండల ప్రధాన కార్యదర్శి పి.నరేష్‌బాబు, న్యాయవాది రెడ్డయ్య, మాజీ సర్పంచులు ఎం.లక్ష్మీనరసయ్య, నారాయణ, మల్లయ్య, పిచ్చయ్య, మండల మాజీ బీసీ సంఘం అధ్యక్షుడు కొండూరు వెంకటయ్య, ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు కొరముట్ల వెంకటసుబ్బయ్య, కత్తి సుబ్బరాయుడు, వెంకటయ్య, కమతం జయరామయ్య, వీరబల్లె హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బాబాఫకృద్దీన్

నందలూరు, సెప్టెంబరు 3: జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కడప డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరి బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించి నందలూరు కోర్టు పరిధిలో గల పోలీసు అధికారులతో న్యాయవాదులు, రెవెన్యూ, బ్యాంకు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించాలని సూచించారు. జాతీయ లోక్‌అదాలత్‌కు రోజూ ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్ నిర్వహిస్తారని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు అమర్‌నాథ్, ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, బ్యాంకు అధికారులు, న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుళ్ల, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా మాధవరం



రోడ్డుపై నిల్వ ఉన్న వర్షంనీరు

సిద్దవటం, సెప్టెంబరు 3: మాధవరం పంచాయతీ రోడ్డు నెంబరు-1 బండ్ల వీధి వర్షాల కారణంగా వర్షపునీరు, మురుగునీరు చేరి అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. ఆ ప్రాంతంలో పరిశుభ్రత పనులు చేపట్టకపోవడంతో మరింత దుర్గంధం వెదజల్లుతుందని కాలనివాసులు వాపోతున్నారు. దీంతో దోమలు కూడా ఉత్పత్తి చెందాయని దీనివల్ల విషజ్వరాలు సోకే ప్రమాదం ఉందని పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని శుభ్రపరచాలన్నారు. ఈ విషయంపై మాధవరం పంచాయతీ సెక్రటరి లక్ష్మీనరసయ్యను వివరణ కోరగా అధిక వర్షాల కారణంగా నీరు రహదారిపై నిల్వ ఉన్నాయని, ప్రతి శుక్రవారం వైద్యసిబ్బందితో కలిసి గ్రామ పంచాయతీలో అపరిశుభ్ర ప్రాంతాలున్నచోట అబేట్ పిచికారీ చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలియజేశారు.

సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పౌష్టికాహార మాసోత్సవంలో సీడీపీఓ

చిట్వేలి, సెప్టెంబరు 3: సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సెప్టెంబరు 1 నుంచి 30వ తేదీ వరకు పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు పరిధిలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పౌష్టికాహార ప్రదర్శన, అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ పుట్టిన ప్రతి జీవికి ఆహారం తప్పనిసరన్నారు. ఆహారం విషయంలో ప్రతిఒక్కరు ఆచితూచి వ్యవహరించాలని సూచించారు. కిశోర బాలికలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం ఉందన్నారు. ప్రకృతిలో దొరికే తాజా కూరలు, కాయగూరలు, పండ్లు, తృణధాన్యాలు, గుడ్లు, పాలు, మాంసాహారం లాంటివి తినడం వల్ల శరీరానికి కావాల్సిన పోషక పదార్థాలు అందుతాయన్నారు. ఆడపిల్లలు పాశ్చాత్య పోకడకు పోతే ఫ్రైడ్ రైస్, నూడుల్స్ కురుకురే ఆహార పాదార్థాల్లో ఏజిటోమోటో కలర్స్ లాంటి క్యాన్సర్ కారకాలు ఉంటాయని హెచ్చరించారు. మంచి ఆహారంతో ఆరోగ్యం సాధ్యమని, ప్రస్తుతం కిశోర బాలికలు ఎదుర్కొంటున్న బాల్య వివాహాలు లాంటి దురాచారాలపై తమను తాము రక్షించుకుంటూ జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని లక్ష్యసాధన కోసం కృషి చేయాలని బాలికలకు ఆమె సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హేమలత, ఐసీడీఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్‌లు వసుంధరమ్మ, సురేఖరాణి, అంగన్వాడీ వర్కర్లు, కేజీబీవీ అధ్యాపక సిబ్బంది, బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వరద సహాయంలో మేము సైతం...



ప్రత్యేక వాహనంలో బయలుదేరుతున్న పంచాయతీ సిబ్బంది

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 3: విజయవాడను అతలాకుతలం చేసిన వరదల్లో తీవ్రంగా ఇబ్బందులకు గురువుతున్న ప్రజానీకానికి మేమున్నామంటూ రైల్వేకోడూరు పంచాయతీ సిబ్బంది ముందుకొచ్చారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం నుంచి విద్యుత్, ప్లంబర్, 14 మంది పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక వాహనంలో విజయవాడకు పయనమయ్యారు. బ్లీచింగ్ పౌడర్, విద్యుత్ సామగ్రి, తదితర పనిముట్లతో తరలివెళ్లారు. ఉమ్మడి జిల్లా అధికారులు పిలుపుమేరకు పంచాయతీ సిబ్బంది విజయవాడకు తరలివెళుతున్నట్లు శానిటరీ అధికారి నౌషాద్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు నార్జాల హేమరాజ్ టీడీపీ యువనేత పోతురాజు సుమన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం

చిట్వేలి, సెప్టెంబరు 3: వరదబాధితుల సహాయార్థం చిట్వేలి పంచాయతీ మంగళవారం తమ సహాయాన్ని పంపించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి రామసుబ్బారెడ్డి విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం పారిశుధ్య కార్మికులు, ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్లను బ్లీచింగ్, ఫినాయిల్, సోడియం క్లోరైడ్, మిలాథిన్, పనిముట్లను పంపించారు. ఈ కార్యక్రమంలో పంచాయతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ఆర్బీఐ 90’ క్విజ్‌లో పాల్గొనాలి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 3: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఏర్పడి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌ను పెంపొందించే ఆర్బీఐ 90 క్విజ్ ఏర్పాటు చేశారని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రతినిధులు తెలిపారు. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు దేశవ్యాప్త పోటీలను నిర్వహించి రూ.10 లక్షల వరకు బహుమతులను ప్రకటిస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని అన్నమయ్య జిల్లా లీడ్‌బ్యాంకు ఆంజనేయులు తెలిపినట్లు వివరించారు. భారతదేశంలో ఏదైనా గుర్తింపు పొందిన కాలేజి, యూనివర్శిటీ నుంచి చదువుతున్న 25 ఏళ్లలోపు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాల కోసం రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రతినిధులు కేపీ రంగనాథ్, శ్రీహరి, ప్రతాప్‌లు తెలిపారు.

అధ్యాపకుడు సురేష్‌కు డాక్టరేట్



రాజంపేట, సెప్టెంబరు 3: అన్నమాచార్య యూనివర్శిటీ ఈఈఈ విభాగం అధ్యాపకుడు సురేష్‌బాబుకు ఎస్వీ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తెలిపారు. సురేష్‌బాబు చేసిన పరిశోధన వల్ల పవర్ సిస్టమ్‌ను ప్రొటెక్టు చేయడం, సెక్యూర్టీ మెరుగుపరచవచ్చన్నారు. ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలో ఓల్టేజి స్థిరత్వాన్ని పర్యవేక్షించడం వల్ల విద్యుత్ నాణ్యతను మెరుగుపరిచి లోపాలను గుర్తించవచ్చన్నారు. ఈ పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ఇచ్చారన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు

నందలూరు, సెప్టెంబరు 3: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిస్టరీ గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి పేర్కొన్నారు. ఎంఏ హిస్టరీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు ఈనెల 10 లోపు కళాశాలలో ప్రిన్సిపాల్‌ను సంప్రదించి దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు.

మట్టి వినాయక ప్రతిమల వితరణ

లక్కిరెడ్డిపల్లె సెప్టంబరు3: వినాయక చవితి సందర్భంగా మంగళవారం జడ్పీ ఉన్న పాఠశాలలో మట్టి వినాయకుని ప్రతిమలను ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మిదేవి అందజేశారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వినాయకచవితి సందర్భంగా ప్రతి ఇంటిలోనూ వినాయక ప్రతిమలు పెట్టాలనుకునే వారు మట్టి ప్రతిమలను మాత్రమే ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, గౌషియా, నారాయణనాయక్, జయంతి, ఉమాబాయి, రామహన్, ఓబయ్య, ఆంజనేయులునాయక్, లక్ష్మిప్రసన్న, సుబ్బారెడ్డి, మనోహర్, పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా చేసుకోవాలి : ఎస్ఐ

సిద్దవటం, సెప్టెంబరు 3: వినాయకచవితి పండుగను ప్రశాంతంగా చేసుకోవాలని సిద్దవటం ఎస్ఐ చిరంజీవి తెలియజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక మండపాల దగ్గర డీజే బాక్సులు, డ్యాన్స్ ప్రోగ్రాంలు పరిమితికి మించి శబ్ద కాలుష్యం చేసే కార్యక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించమన్నారు. కేవలం పూజా కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు మాత్రమే మైకు అనుమతి ఉంటుందన్నారు. మద్యంతాగి వినాయక మండపాల వద్ద గొడవలు చేయడం, అనవసరమైన కార్యక్రమాలు చేపట్టడం వంటివి చేస్తే చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు. డీజే పాటలకు, డ్యాన్స్ కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వబడవన్నారు. మండపాల వద్ద షరతుల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

టీబీపై అవగాహన సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శేఖర్ రెడ్డి

సుండుపల్లి, సెప్టెంబరు3: రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం టీబీపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ టీబీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి లక్షణాలను ప్రజలకు తెలియజేస్తూ అప్రమత్తంగా ఉండలని సూచించారు. వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు సరఫరా చేస్తారన్నారు. 6 నెలలు వాడితే వ్యాధి నయం అవుతుందన్నారు.

దాతలు ముందుకు రావాలి

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 3: వరద బీభత్సం నుంచి మన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి దాతలు ముందుకు రావాలని రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లెం హేమంత్ కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు ప్రైవేట్ కళాశాలలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. సీఎం చంద్రబాబు నాయుడు వరద బాధితులను ఆదుకోవడం కోసం చేస్తున్న కృషి చేస్తున్నారని కొనియాడుతూ బాధితులను ఆదుకోవడం కోసం మనమంతా ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు పంపించాలని పిలుపునిచ్చారు.

మట్టి ప్రతిమలను తయారు చేసిన విద్యార్థులు



తయారు చేసిన మట్టి, పసుపు ప్రతిమలతో విద్యార్థులు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 3: వినాయకచవితి సందర్భంగా పర్యావరణం దెబ్బతినకూడదనే ఉద్దేశంతో రాజంపేట విద్యార్థులు అనేక మంది మట్టి ప్రతిమల తయారీలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా స్థానిక హెల్పింగ్‌హ్యాండ్స్ నిర్వాహకులు రమణ, ప్రకృతి ప్రేమికులు శివాజి, శ్రీ విద్యానికేతన్ కరస్పాండెంట్ అబ్బూరు ప్రభాకర్‌నాయుడు, ప్రిన్సిపాల్ సుప్రియ నేతృత్వంలో విద్యానికేతన్ విద్యార్థులు మట్టి, పసుపుతో వినాయక ప్రతిమలు తయారు చేయించారు. ప్లాస్టిక్ వాడకంతో విష రసాయనాలతో వినాయక ప్రతిమలు తయారు చేయడం వల్ల పర్యావరణానికి ముప్పు కలుగుతుందన్నారు. ప్రకృతికి మేలు చేసే మట్టి, పసుపుతో వినాయక ప్రతిమలను విద్యార్థుల చేత చేయించి వాటిని పంపిణీ చేస్తామన్నారు. ఈ ప్రతిమలను నిమజ్జనం చేస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదని ఈ విషయాలను వివరిస్తూ విద్యార్థులను మేలుగొలుపుతూ మట్టి ప్రతిమలను తయారు చేచామన్నారు.

యానిమేటర్లకు వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ డిమాండ్



రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 3: యానిమేటర్లకు (సెర్ప్‌వీఓఏ) బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 2024 జనవరి నుంచి వేతనాల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సెర్ప్‌వీఓఏలకు వేతనాలను వ్యక్తిగత అకౌంట్లలో చెల్లించాలని, ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పిం చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

లక్కిరెడ్డిపల్లె సెప్టంబరు3: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని కోనంపేట, దేవళంపల్లె డాక్టర్ సిద్దయ్య, నజీయా బేగం పేర్కొన్నారు. ఆశాడే, నీతిఅభియోగ్‌లో భాగంగా మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది సమావేశంలో వారు మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాల్లో మురికినీరు నిల్వఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్య అభియాన్‌కింద 12 వారాల లోపే గర్భిణుల పేర్లను ఆన్‌లైన్ నమోదు చేయాలని సూచించారు బీపీ, సుగర్ వ్యాధి గ్రస్తులను వంద శాతం సర్వే చేయాలని, టీబీ వ్యాధి గ్రస్తులను గుర్తించి వారిని కమ్యూనిటీ ఆస్పత్రికి, లేదా పాథమిక ఆరోగ్యకేంద్రానికి పంపి పరీక్షించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ వెంకటరామిరెడ్డి, సీహెచ్‌ఓలు రవీంద్ర, ఎంపీహెచ్‌ఓ దేవదానం, సూపర్‌వైజర్లు సురేంద్రారెడ్డి, మణి, సరళ, టీబి సూపర్‌వైజర్ హరి ఎంఎల్‌హెచ్‌పీలు ఏఎన్‌ఎంలు,ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి- తిరుపతి

బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) సరైన పర్యవేక్షణ లేక పాలన గతి తప్పుతోంది. వివాదాల సుడిలో చిక్కుకున్న బర్డ్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకరిద్దరు చేసిన తప్పులకు వైద్యులు, కిందిస్థాయి సిబ్బంది విజిలెన్స్ విచారణ ఎదుర్కోవాల్సి రావడంతో విధుల్లోకి వచ్చేందుకు భయపడుతున్నారు. సెలవుపెట్టి వెళ్లిపోతుండడంతో ఓపీలు తగ్గిపోతున్నాయి. ఆపరేషన్లు వాయిదా పడుతున్నాయి.

గతి తప్పిన 'బర్డ్'



ఆరోగ్యమిత్ర డెస్క్ ముందు వేచివున్న వృద్ధ జంట

● వైద్యులు లేక పడిపోయిన ఓపీలు ● గత అక్రమాలపై కొనసాగుతున్న విచారణ

ఒకప్పటి బర్డ్‌లా లేదు

350 పడకల సామర్థ్యం కలిగిన బర్డ్‌కు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రోజూ సుమారు 700మందికి పైగా అవుట్ పేషెంట్లు వైద్య సేవల కోసం వస్తుంటారు. రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ఆధునిక వసతులున్నాయి. ఆరు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లలో రోజుకు 25 వరకు శస్త్ర చికిత్సలు జరిగేవి. ప్రస్తుతం ఆపరేషన్ల సంఖ్య పదికిలోపే పడిపోయింది. ఒకప్పుడు బర్డ్‌లో ఓపీ తీసుకోవాలంటే ఉదయం ఐదు గంటలకే చేరుకోవాలి. వారంతో పనిలేకుండా ఆ స్థాయిలో రద్దీ ఉండేది. మధ్యలో ఏదైనా సెలవు వస్తే తర్వాత రోజు రెట్టింపు రోగులు వచ్చేవారు. గడిచిన ఐదేళ్లుగా పరిస్థితి మారిపోయింది. టీటీడీ నిధులతో నిర్వహించే ఆస్పత్రిని కమర్షియల్‌గా మార్చడంతో సహజంగా పేదరోగుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఆగస్టు 15నుంచి వరుసగా నాలుగు రోజులపాటు బర్డ్‌లో ఓపీలు చూడలేదని తెలిసింది. స్వాతంత్ర్య దినోత్సవంతోపాటు ఒక రోజు ఆదివారం రావడం, మధ్యలో శ్రావణశుక్రవారం, మెడికో మృతికి నిరసనగా వైద్యం బంద్ చేసి మొత్తం నాలుగు రోజులు ఓపీలు లేకుండా చేశారు. టీటీడీ సంస్థల్లో బంద్ నిర్వహించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నిరసన పేరుతో ఓపీకి సెలవు ప్రకటించేశారు. దీనిపై టీటీడీ విజిలెన్స్ విచారణ కూడా చేసినట్టు తెలిసింది. ఇక అసలు విషయానికి వస్తే నాలుగు రోజుల సెలవుల తర్వాత వచ్చిన సోమవారం ఓపీ హాలు కిక్కిరిసిపోవాలి. కానీ ఆ రోజు కూడా ఓపీ హాలు ఖాళీగా కనిపించింది. ఇద్దరు ముగ్గురు వైద్యులు మాత్రమే వారి చాంబర్‌లో ఉంటే వందలోపు మాత్రమే రోగులు కనిపించారు. వారు కూడా రోజుకు 20 మందికిపైగా ఓపీ చూడలేమని తేల్చి చెప్పేసినట్టు తెలిసింది. ఇక ఆరోగ్యమిత్ర డెస్క్ వద్ద గంటపాటు ఎవరూ కనిపించలేదు. ఎన్టీఆర్ వైద్యసేవ కోసం వచ్చిన ఓ వృద్ధ జంట డెస్క్ ముందు నిల్చొని విసిగిపోయి పక్కకు వెళ్లిపోవడం కనిపించింది. సెక్యూరిటీ సిబ్బంది స్మార్ట్ ఫోన్‌లో రీల్స్ చూసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. నాలుగైదు బెడ్లు కలిగిన ప్లాస్టర్ గదిలో ఇద్దరు సిబ్బంది పనిలేక పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.ఎవరెవరు వస్తున్నారో? ఎప్పుడొస్తున్నారో? పట్టించుకునే పరిస్థితి కనిపించలేదు.పూర్తిస్థాయి డైరెక్టర్ బర్డ్‌లో అందుబాటులో ఉంటే సిబ్బందికి కూడా జవాబుదారీతనం ఉంటుంది. పాలనాపరమైన వ్యవహారాలతోపాటు రోగులకు మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుంది. ఆ దిశగా టీటీడీ ఉన్నతాధికారులు దృష్టిపెట్టాల్సి ఉంది.

పర్చేజ్ కమిటీ సభ్యులకు మెమోలు

బర్డ్‌లో విజిలెన్స్ విచారణ కూడా కొనసాగింది. మాజీ ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి బాగోతాలను ఒక్కొక్కటిగా బయటకు లాగుతున్నారు. అదేవిధంగా ఆయన నేతృత్వంలో ఏర్పాటైన పర్చేజ్ కమిటీ సభ్యులు డాక్టర్ దీపక్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రామ్మూర్తిలతో పాటు ఆఫీస్ సూపరింటెండెంట్ మల్లీశ్వరికి విజిలెన్స్ అధికారులు మెమోలు ఇచ్చినట్టు తెలిసింది. సీటీ స్కాన్ కొనుగోలుకు టెండర్లు ఎలా పిలిచారు? ఇంప్లాంట్లు సరఫరా చేసే కంపెనీలను ఏ ప్రాతిపదికన తీసుకున్నారు? ఆపరేషన్ చేసే వైద్యుల ఇష్టానుసారం పలానా కంపెనీ ఇంప్లాంట్ రోగికి అమర్చారా? లేదా రెడ్డెప్పరెడ్డి సూచించినవే వినియోగించారా? వంటి అంశాలపై ఆరా తీస్తున్నట్టు తెలిసింది. అది కూడా విజిలెన్స్ అధికారులు రూపొందించిన ప్రశ్నల ఫార్మాట్‌ను మెమోలతోపాటు ఇచ్చి వాటిని పూరించాలని చెప్పినట్టు సమాచారం. అయితే కొన్ని మెడికల్ సాంకేతిక అంశాలపై లోతుగా విచారణ చేసేందుకు విజిలెన్స్ సిబ్బంది తటపటాయిస్తున్నట్టుగా తెలుస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి విచారణ ఏదైనా వస్తే పూర్తిస్థాయి అవగాహన ఉన్న సీనియర్ వైద్యులను ముందుగానే టీటీడీ అనుబంధ ఆస్పత్రులకు రెడ్డెప్పరెడ్డి బదిలీ చేయించినట్టుగా చెబుతున్నారు. అలాంటి వాళ్లగురించి తెలుసుకుని విచారిస్తే విజిలెన్స్ అధికారులకు మరింత సమాచారం దొరికే అవకాశం ఉంటుంది.

మెడికల్ షాపు కూడా మూతే

బర్డ్‌లో జనరిక్ బ్రాండెడ్ ఫార్మసీని ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వంలో టీటీడీ నిర్ణయం తీసుకుంది. బర్డ్‌కు అనుబంధంగా ఉన్న మెడికల్ షాపుతోనే జనరిక్ మెడికల్ షాపు నిర్వహించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. 20 శాతం ఆదాయంతో రోగులకు మందులను సరఫరా చేస్తారు. ఇందులో వచ్చిన ఆదాయంలో చెరిసగం పంచుకునేలా ఒకే బ్రాండెడ్ మందులు జన ఔషధి మెడికల్ షాపులో అందుబాటులో ఉంటాయి. దీనికి సంబంధించిన పూర్తి సాఫ్ట్‌వేర్‌ను కూడా బర్డ్ తీసుకొచ్చింది. బర్డ్ కొత్త భవనం కిందనే జనరిక్ మెడికల్ షాపును పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేశారు. అయితే అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఆ తర్వాత ఓపెన్ టెండర్ ద్వారా మెడికల్ షాపు కేటాయించినప్పటికీ బర్డ్ ఉన్నతాధికారికి, నిర్వాహకులకు లావాదేవీల్లో తేడా రావడంతో ప్రస్తుతం ఆ షాపు కూడా మూసివేశారు. ఇప్పుడు బర్డ్‌లో ఎలాంటి మెడికల్ షాపు లేకపోవడంతో రోగులు మందుల కోసం చీటీలు పట్టుకుని తిరుగుతున్నారు.

పట్టించుకోండి సారూ

టీటీడీ నిర్వహణలో ఉన్న బర్డ్ ఆస్పత్రి పాలనను పట్టించుకోకుండా అధికార యంత్రాంగం గాలికొదిలేసిందన్న విమర్శలు వస్తున్నాయి. ఉన్న ఒక్క ఆర్ఎంవో కూడా దీర్ఘకాలిక సెలవుపెట్టి వెళ్లిపోతున్నారు. ఆరకొర సీనియర్ వైద్యులకు కూడా అక్కడ విలువలేదని తెలుస్తోంది. దీంతో వారు కూడా అసంతృప్తితో విధులు నిర్వహించే పరిస్థితి. విద్య, వైద్యానికి మాత్రమే ఉండే టీటీడీ జేఈవో గౌతమి బర్డ్‌వైపు వెళ్లడంలేదన్న విమర్శలున్నాయి. ఇక ఇంచార్జి డైరెక్టర్‌గా ఉన్న మరో జేఈవో వీరబ్రహ్మం పరిస్థితి అలాగే తయారైంది.ఈవో ప్రత్యేక దృష్టి పెడితే తప్ప తలా, తోక లేని పక్షిగా మారిన బర్డ్ ఆస్పత్రి పూర్వ వైభవం సంతరించుకోదు.



డైరెక్టర్ గదికి తాళం - ఖాళీగా దర్శనమిస్తున్న ఓపీ హాలు

ఎస్బీఐ ఏటీఎం దొంగల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 3: ఎస్బీఐ ఏటీఎంల నుంచి రూ. 39.53 లక్షలు కాజేసిన ఘటనలో కస్టోడియన్ కొంగర్ల సురేష్ బాబుతోపాటు నెల్లూరు జిల్లా బుజబుజ నెల్లూరుకు చెందిన క్యాష్ వ్యాన్ డ్రైవర్ మనోజ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు కథనం మేరకు... తిరుపతిలోని కట్టకింద కొత్తపల్లికి చెందిన సురేష్ బాబు సెక్యూర్ వ్యాల్యూ ఇండియా లిమిటెడ్ సంస్థ ద్వారా ఎస్బీఐ పరిధిలోని 22 ఏటీఎంలకు కస్టోడియన్‌గా పనిచేస్తున్నాడు.ఇటీవల బెట్టింగ్‌లకు అలవాటు పడి భారీస్థాయిలో నష్టపోయాడు. దీంతో ఏటీఎంల నుంచి డబ్బులు కాజేయడానికి పథకం పన్నాడు.తిరుపతిలోని గిరిపురం, ఎల్.ఎస్.నగర్, కె.టి. రోడ్డులో ఉన్న మాన్యువల్ ఏటీఎంల నుంచి దశల వారీగా రూ.40 లక్షలనగదు కాజేశాడు.ఇంతలో ఎస్బీఐ ఏటీఎంలకు ఆడిట్ జరగబోతుందని తెలుసుకున్న సురేష్ బాబు మెల్లగా ఆ మూడు ఏటీఎంలలో అపహరించిన డబ్బును సరిచేసుకోవడం కోసం చంద్రగిరి ఏటీఎంలో వుంచడానికి ఇచ్చిన డబ్బును కాజేసి ఆ మూడు ఏటీఎంలలో సర్దాలనుకున్నాడు.ఈ నేపథ్యంలో ముత్తుట్ ఫైనాన్స్‌లో పరిచయమైన మనోజ్‌కు గతనెల 30వ తేది రాత్రి సెక్యూరిటీ గార్డు వేషం వెయించి, చేతికి గ్లౌజులు, ముకానికి మాస్క్ వేసి చంద్రగిరి ఏటీఎంలో దొంగతనం చేయించాడు.ఈ విషయం తెలుసుకున్న సెక్యూర్ వ్యాల్యూ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రతినిధి ఎస్బీఐ చీఫ్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు చంద్రగిరి సీఐ రామయ్య కేసు నమోదుచేశారు. చంద్రగిరి ఎస్బీఐ ఏటీఎంలో నగదు అపహరణ కేసుకు సంబంధించి సమీపంలో ఉన్న పవిత్ర క్యాంటీన్ సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు.అక్కడ కన్పించిన మారుతి కారు నెంబరు ఆధారంగా ముందుకెళ్లారు.ఏఎస్పీలు రవి మనోహరాచారి, వెంకట్రావు, నాగభూషణరావు, డీఎస్పీలు రమణకుమార్, నరసింగప్ప, చంద్రగిరి ఎస్ఐ రామయ్య నాలుగు రోజులుగా వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు.చంద్రగిరి మండలం గాదంకి టోల్‌గేట్ సమీపంలోని రాధే హోటల్ వద్ద సురేష్‌బాబును, మనోజ్‌ను అరెస్టు చేశారు. వారి వద్దనుంచి ఓ మారుతి కారుతోపాటు రిఫ్రిజిరేటర్, 2 సెల్ ఫోన్లు, 4 ఎస్బీఐ ఏటీఎం క్యాసెట్లు, యమహా స్కూటీ, రూ. 8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

ఎస్ఐ రవిబాబు సస్పెన్షన్



తడ, సెప్టెంబరు 3: సూళ్లూరుపేటలో గత ఏడాది అక్టోబరు వరకు ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న రవిబాబుపై సస్పెన్షన్ వేటు పడింది.సూళ్లూరుపేట నుంచి రవిబాబు ఓజిలికి బదిలీ అయ్యాక వీఆర్‌కు పంపారు. అయితే సూళ్లూరుపేట ఎస్ఐగా ఉన్నప్పుడు జరిగిన అవకతవకలపై ఇప్పుడు చర్యలు తీసుకున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు మారణాయుధాలతో దాడి చేశారు. టీడీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలవడంతో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆ తరువాత వైసీపీ నాయకులు కల్పించుకోవడంతో కేసు నీరుగారిపోయింది.చివరకు ప్రత్యక్ష సాక్షులను సైతం తారుమారు చేసి కేసును తప్పుదోవ పట్టించారు. ఘటన జరిగిన ప్రదేశంలో దాడికి ఉపయోగించిన వస్తువులను సైతం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపకుండా దర్యాప్తును నిర్లక్ష్యం చేశారు.దీనిపై అప్పట్లో పోలీసులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా ఈ కేసుకు సంబంధించిన ఆరోపణలపై ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేకంగా దృష్టిసారించి అంతర్గత విచారణ జరిపారు. ఇందులో అప్పట్లో ఎస్ఐగా పనిచేసిన పి.రవిబాబు నిర్లక్ష్యం బయటపడడంతో పాటు నిందితుల పేర్లను అనధికారికంగా తొలగించారని విచారణలో నిర్ధారణ కావడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు జారీ చేశారు.

కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డుల సస్పెన్షన్

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 3 : గాజుల మండ్యం స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె. బాలాజీతో పాటు ఇద్దరు హోంగార్డులపై సస్పెన్షన్ వేటు పడింది.చైనా దేశీయుడికి వీసా గడువు పూర్తయినా ఇక్కడే నివాసముండడంపై 2021లో రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదుచేశారు.అయితే చైనీయుడికి సహాయం చేస్తానంటూ బాలాజీ అతడి వద్దనుంచి రూ. 2లక్షలు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో అతడిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి రూరల్ పోలీస్టేషన్‌లో పని చేస్తున్న హోంగార్డు గిరి ఇసుక, కంకర రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని విచారణలో నిరూపణ కావడంతో అతడిని సస్పెండ్ చేశారు.అలిపిరి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు రాజ్‌కుమార్ ఇతరుల మొబైల్ ఫోన్ల నుంచి ఉన్నతాధికారులకు తోటి సిబ్బందిపై లేనిపోని ఆరోపణలు చేస్తుండడం గమనించి అతడిని సస్పెండ్ చేశారు. వీరిపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు.

ప్రియురాలికి పెళ్లి నిశ్చయమైందని ప్రియుడి ఆత్మహత్య



సాగర్‌బాబు (ఫైల్‌ఫొటో)

రామకుప్పం, సెప్టెంబరు 3: ప్రియురాలికి మరొకరితో పెళ్లి నిశ్చయమైందని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. రామకుప్పం మండలం మణీంద్రం గ్రామానికి చెందిన నారాయణస్వామి, గాయత్రి దంపతుల కుమారుడు సాగర్‌బాబు(18) ఇంటర్ చదువుతున్నాడు. కొంతకాలంగా ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఆమెకు ఇటీవల మరో యువకుడితో పెళ్లి నిశ్చయమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కొంతసేపటికి ఇంటికి వచ్చిన నారాయణస్వామి.. ఉరికి వేలాడుతున్న కుమారుడిని గమనించారు. ఇంట్లో వాళ్లతో కలిసి అతడిని కిందకు దింపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి గాయత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఐసీడీఎస్ అధికారిపై టీడీపీ నేతల ఆగ్రహం

● ఎమ్మెల్యేల సిఫార్సుల్ని ఖాతరు చేయడం లేదంటూ ఫిర్యాదులు

చిత్తూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఐసీడీఎస్‌లో ఓ అధికారి తీరుపై టీడీపీ నాయకులు అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. ఐసీడీఎస్‌లో అంగన్వాడీ పోస్టుల నియామకాల్లో ఎమ్మెల్యేలకు తెలియకుండా, వారి సిఫార్సుల్ని పట్టించుకోకుండా అభ్యర్థులతో మాట్లాడుకుని నేరుగా నియామకాలు పూర్తి చేశారంటూ ఆ అధికారిపై వారు ఆగ్రహంతో ఉన్నారు. ఓ నియోజకవర్గంలో అంగన్వాడీ టీచర్ పోస్టు భర్తీ కోసం తాను సిఫారసు చేసినా పట్టించుకోలేదని, పైగా కలెక్టర్ పేరు చెప్పి వేరేవారిని నియమించారని ఆయన వాపోతున్నారు. ఈ విషయాన్ని ఆ ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. 'నేను సిఫార్సు చేయలేదు. పూర్తిగా విచారిస్తా'నని చెప్పినట్లు తెలుస్తోంది. కాగా అంగన్వాడీ టీచర్, ఆయా పోస్టులతో పాటు 9 రకాల సింగిల్ పోస్టుల (ప్రొటెక్షన్ ఆఫీసర్, కౌన్సిలర్, సోషల్ వర్కర్, అకౌంటెంట్, డేటా అనలిస్ట్ వంటివి..) భర్తీ కూడా ఇటీవల జరిగింది. ఈ నియామకాల్లో కూడా ఆ అధికారి ఇలాగే వ్యవహరించారని వారు అంటున్నారు. అధికారి తీరుపై టీడీపీ నాయకులు ఇటీవల కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ సమక్షంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ఆ అధికారి పెద్దిరెడ్డి అండతో సుదీర్ఘకాలంగా జిల్లాలో పనిచేశారని, ప్రభుత్వం మారినా కొనసాగుతున్నారని వారు పేర్కొన్నారు.

డీఈవోపై ఫిర్యాదుల పరంపర

చిత్తూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీఈవో దేవరాజు వ్యవహారశైలి రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. అటు ఎమ్మెల్యేలు, ఇటు ఉపాధ్యాయ సంఘాలు ఈయనపై గుర్రుగా ఉన్నారు. జిల్లా ఉన్నతాధికారికి సైతం ఇతని తీరు నచ్చడం లేదని తెలుస్తోంది. తాజాగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు డీఈవో దేవరాజు గురించి నేరుగా కలిసి ఫిర్యాదు చేయడంతో ఇతని విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. ఆ మధ్య ఎమ్మెల్యే మురళీమోహన్ బంగారుపాళ్యం పాఠశాలలో పనిచేసే ఓ నాన్‌టీచింగ్ సిబ్బంది డిప్యుటేషన్ అంశాన్ని పరిశీలించాలని సిఫార్సు చేశారు. దాన్ని పరిగణలోకి తీసుకోకపోవడంతో పాటు ఆ మహిళా ఉద్యోగిపై ఆగ్రహించి, ఆమె వెంట వెళ్లిన హెచ్ఎంకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. దీంతో పాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విద్యాకానుకల పంపిణీ కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యేలతో కలిసి ఈయన పాల్గొనలేదు. దీంతో పాటు టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్ జాబితా తయారీలో నిర్లక్ష్యం, రివర్షన్ ఆర్డర్లను ఇవ్వకపోవడం వంటి శాఖాపరమైన అంశాలపైనా డీఈవో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ అంశాలన్నీ కలిపి అప్పట్లో ఆంధ్రజ్యోతిలో 'గాడి తప్పిన విద్యాశాఖ' శీర్షికతో కథనం ప్రచురితమైంది. డీఈవో తీరుకు నిరసనగా ఆగస్టు 3వ తేదీన డీఈవో కార్యాలయానికి ఎదురుగా ఉపాధ్యాయులు ధర్నా చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. 'నాకే వ్యతిరేకంగా ధర్నా చేస్తారా' అంటూ అక్కడ పాల్గొన్న కొంతమంది ఉపాధ్యాయ సంఘ నాయకుల్ని షోకాజ్ నోటీసులు జారీ కూడా చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కూడా ఇప్పటికే పలుమార్లు వివిధ అంశాల మీద డీఈవోకు కాల్ చేసి విభేదించారు.

స్విమ్స్‌లో అదృశ్యమై.. రుయాలో దొరికాడు

● రోగి ఆచూకీ తెలియడంతో ఊపిరి పీల్చుకున్న స్విమ్స్ అధికారులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 3 : స్విమ్స్‌లో కనిపించకుండా పోయిన రోగి సీతారామప్ప మంగళవారం రుయాలో ప్రత్యక్షం కావడంతో వారం రోజులుగా ఆయన ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్న స్విమ్స్ అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్పను కుమారుడు విశ్వనాథ్ గత నెల 27న వైద్యం కోసం స్విమ్స్‌కు తీసుకురావడంతో ఎంఐసీయూ వార్డులో అడ్మిట్ చేసిన విషయం తెలిసిందే. అదేరోజు రాత్రి సీతారామప్ప కన్పించకుండా పోయాడు. స్విమ్స్ అధికారులకు విశ్వనాథ్ తెలిపినా పట్టించుకోకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.29న ఆంధ్రజ్యోతిలో స్విమ్స్‌లో రోగి అదృశ్యం శీర్షికన వార్త ప్రచురితమవడంతో పోలీసుల సహకారంతో స్విమ్స్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.ఐదు రోజుల తరువాత ఆదివారం స్విమ్స్‌లోని సీసీ కెమెరాల్లో సీతారామప్ప ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న దృశ్యాలను గుర్తించారు. ఆయన స్వయంగా ఆస్పత్రిలో నుంచి వెళ్లిపోయాడు కాబట్టి తమకేం సంబంధం లేదని స్విమ్స్ అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ నేపథ్యంలో సీతారామప్ప ఎక్కడికి వెళ్లుంటాడనే కోణంలో పోలీసులు, మరో పక్క ఆయన బంధువులు గాలింపు చర్యలను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో సీతారామప్ప రుయాస్పత్రిలో ఉన్నట్లు తెలిసిన వారు విశ్వనాథ్‌కు సమాచారం ఇచ్చారు.దీంతో రుయాకు వెళ్లగా కాలికి బలమైన గాయంతో ఆర్థోవార్డులో చికిత్స పొందుతూ సీతారామప్ప కనిపించాడు. స్విమ్స్‌లో నుంచి వెళ్లిపోయాక ఒక వాహనం సీతారామప్పను ఢీకొట్టడంతో అతడి కాలికి బలమైన గాయం తగిలింది. దీంతో అక్కడున్న కొందరు గత నెల 30న సీతారామప్పను రుయాస్పత్రి అత్యవసర విభాగంలో అడ్మిట్ చేసి వెళ్లిపోయారు.సీతారామప్ప మాట్లాడే పరిస్థితిలో లేకపోవడంతో మొదట రుయాస్పత్రిలోని వైద్యులు గుర్తు తెలియని వ్యక్తిగా రికార్డుల్లో నమోదు చేసుకున్నారు.సీతారామప్ప కోలుకున్న తరువాత తన పేరు మాత్రమే చెప్పి చిరునామా చెప్పేందుకు అంగీకరించకపోవడంతో కేవలం పేరు మాత్రమే నమోదు చేసుకొని అతడిని ఆర్థో వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వార్డులో ఓ స్టాఫ్‌నర్సు సీతారామప్పకు సంబంధించి పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా అతడిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే వెస్ట్ సీఐ రామకృష్ణ రుయాకు చేరుకొని సీతారామప్ప నుంచి వివరాలు సేకరించారు.స్విమ్స్ వైద్యులు అడ్మిట్ చేయాలని చెప్పడంతో తండ్రిని విశ్వనాథ్ ఎంఐసీయూ వార్డుకు తీసుకువెళుతున్న క్రమంలో సీతారామప్ప ఆస్పత్రిలో ఉండలేనని కుమారుడికి చెప్పాడు.దీంతో ఉండకపోతే జబ్బు ఎలా తగ్గుతుంది అని కొడుకు గట్టిగా అరవడంతో నొచ్చుకున్న తాను అదే రోజు రాత్రి ఆస్పత్రి నుంచి వెళ్లిపోయినట్లు సీతారామప్ప వివరించాడు.కాగా సీతారామప్పకు సంబంధించి వరుస కథనాలను ప్రచురించి ఆయన ఆచూకీ లభించేందుకు సాయపడిన ఆంధ్రజ్యోతికి ఆయన కుమారుడు విశ్వనాథ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.



సీతారామప్ప

రుయాస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

వెన్నెముకలో అరుదైన కణితి తొలగింపు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 3: లక్ష మందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధితో బాధపడుతున్న 15 ఏళ్ల బాలుడికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతగా నిర్వహించామని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. ఆస్పత్రిలోని తన చాంబర్‌లో ఆయన మంగళవారం మీడియాతో వివరాలు వెల్లడించారు. 'చిత్తూరు జిల్లాకు చెందిన 15 ఏళ్ల బాలుడు రెండు కాళ్లకు పక్షవాతంతో బాధపడుతున్న క్రమంలో రెండు నెలల కిందట కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు వెన్నెముకలో అరుదైన కణితి ఉందని గుర్తించారు. ఇది సాధారణంగా కాకుండా అందులో వెంట్రుకలతో కలిసి ఉండటాన్ని గమనించారు. ఇది లక్షల్లో ఒకరికి వచ్చే టెరాటోమా వ్యాధిగా తేలింది. వెంటనే న్యూరోసర్జన్లు, అనస్థీషియా వైద్యులు శ్రమించి బాలుడి వెన్నెముకలోని కణితిని తొలగించారు. శస్త్ర చికిత్స తర్వాత బాలుడికి ఫిజియోథెరపీ చేయడంతో పూర్తిగా కోలుకోవడంతోపాటు సాధారణంగా నడుస్తున్నాడు' అని రవిప్రభు తెలిపారు. ఇటువంటి సర్జరీలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే చేస్తారని ఇందుకు రూ.లక్షలు ఖర్చవుతాయని చెప్పారు. రుయాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండటంతో ఇటువంటి సర్జరీని విజయవంతంగా చేయగలిగామన్నారు. అసిస్టెంట్ ఆర్ఎంవో హరికృష్ణ, వైద్య నిపుణులు నాగరాజు, అనంత కిరణ్, సుదర్శన్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

టూరిస్టు హబ్‌గా మాధవమాల

కొయ్యబొమ్మలకు భౌగోళిక గుర్తింపు కోసం జీఐ అధ్యయన బృందం పరిశీలన

ఏర్పేడు, సెప్టెంబరు 3: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని మాధవమాల గ్రామం భవిష్యత్తులో టూరిజం హబ్‌గా తయారు కాబోతుందని జియోలాజికల్ ఐడెంటిటీ (జీఐ) బృందం సభ్యులు పేర్కొన్నారు.మాధవమాల కొయ్యబొమ్మలు భౌగోళిక గుర్తింపు పొందడానికి అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు జీఐ నిపుణులు రిసెల్యూట్ సంస్థకు చెందిన శుభాజిత్ సాహో, శ్రీవత్స మంగరాటి మంగళవారం మాధవమాలకు వచ్చారు. గ్రామంలో ఉన్న బాలాజీ వుడ్ కార్వింగ్ సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాధవమాల గ్రామంలో కళాకారులు తయారు చేస్తున్న కొయ్య బొమ్మలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడానికి జీఐ ట్యాగ్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దేశంలో 7వుడ్ కార్వింగ్ సొసైటీలకు జీఐ ట్యాగ్‌ను ఇప్పటికే అందించడం జరిగిందని చెప్పారు.బాలాజీ వుడ్ కార్వింగ్ సొసైటీకి జీఐ ట్యాగ్‌ను అందించిన వెంటనే ఆ సంస్థకు, అందులో పనిచేస్తున్న కార్మికులకు ఎస్‌వోసీ సర్టిఫికెట్లను అందిస్తుందని తెలిపారు. వాటిని ఆధారం చేసుకుని కార్మికులు ఏ ప్రాంతంలో అయినా బాలాజీ వుడ్‌కార్వింగ్ సొసైటీ అండర్ టేకింగ్ పేరుతో కొయ్య బొమ్మలు తయారు చేసుకుని అమ్ముకునే వెసులుబాటు ఉంటుందన్నారు. బొమ్మలను మార్కెట్ ధర కంటే ఎక్కువగా అమ్ముకోవడానికి జీఐ దోహదపడుతుందని తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు భౌగోళిక గుర్తింపు కలిగినవి 19సంస్థలుమాత్రమే ఉన్నాయని, మాధవమాలలో కొయ్యబొమ్మల తయారీవిధానంపై తాము అధ్యయనం చేశామన్నారు.నాలుగు నెలల తరువాత తాము అందించిన అప్లికేషన్‌పై చెన్నై వేదికగా ఆరుగురు సెంట్రల్ సభ్యులు అధ్యయనం చేసి బాలాజీ వుడ్‌కార్వింగ్ సంస్థకు జీఐ గుర్తింపును ఇవ్వడం జరుగుతుందన్నారు.బాలాజీవుడ్ కార్వింగ్ సంస్థ ప్రమోటర్ కృష్ణమూర్తి, సంస్థ అధ్యక్షులు లోకనాథం ఆచారి, కార్యదర్శి రాజాచారి తదితరులు పాల్గొన్నారు.



మాధవమాల వుడ్‌కార్వింగ్ సొసైటీలో కళాకారులు తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న జీఐ బృందం

జిల్లాలో మోస్తరు వర్షం

చిత్తూరుకలెక్టరేట్, సెప్టెంబరు 3: జిల్లావ్యాప్తంగా 13మండలాల్లో గడచిన 24గంటల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాల వారీగా పులిచెర్లలో 24.2, రొంపిచెర్లలో 17.2, సదుంలో 17.2, చౌడేపల్లెలో16.6, సోమలలో12.4, ఐరాలలో9.2. నగిరిలో 5.8, రామకుప్పంలో 4.2. గుడుపల్లెలో 3.4, వెదురుకుప్పంలో 2.4. నింద్రలో 2.4, పుంగనూరులో 2.2, పూతలపట్టులో 0.4, మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

మదనపల్లె హౌసింగ్ సొసైటీకి ప్రత్యేకాధికారి నియామకం

కలికిరి, సెప్టెంబర్లు 3: మదనపల్లె హౌస్ బిల్డింగ్ సొసైటీకి ప్రత్యేక అధికారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మదనపల్లె డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రారుగా పనిచేస్తున్న ఎ. ప్రవీణ్ కుమార్‌ను పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీకి ఎన్నికలు జరిగేంత వరకూ గానీ, లేదా వచ్చే ఏడాది మార్చి 15 వ తేదీ వరకూ గానీ ఆయన పదవిలో కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి


రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో గ్లోరియా

కలకడ, సెప్టెంబరు 3: ప్రభుత్వం నిర్ధేశించిన ప్రకారం వివిధ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని చిత్తూరు జడ్పీ సీఈవో గ్లోరియా సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆమె కలకడ ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల మేరకు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి, సిబ్బంది బాషా మొహిద్దీన్ పాల్గొన్నారు.

వృక్షాల సంరక్షణ అవసరం

కలకడ, సెప్టెంబరు 3:మానవ మనుగడకు వృక్షాల సంరక్షణ అవసరమని జనసేన నాయకులు తెలిపారు. సోమవారం జరిగిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం, కోటి మొక్కల వన మహోత్సవాలను పురస్కరించుకొని ఆదర్శ పాఠశాల, కేజీబీవీలో వారు మొక్కలను నాటారు. భావితరాలకు ఉపయోగపడేలా మొక్కలను కాపాడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మలాంషావలి, అనిత, నాయకులు సుదర్శన్, గంగాధర్, హసన్‌బాష, ఏజాజ్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయాలి

కలకడ, సెప్టెంబరు 3: తల్లీబిడ్డల సంరక్షణకు వ్యాధి నిరోధక టీకాలను వేయాలని డాక్టర్ జవహర్‌బాబు సూచించారు. ఆశా డే సందర్భంగా మంగళవారం సిబ్బంది సమావేశంలో మాట్లాడుతూ మూడు నెలల నుంచి కాన్పు వరకు గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. అలాగే బీసీజీ సర్వే, వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది జయరామయ్య, వెంకటేశ్వరరావు, సుబ్బరత్న, రెడ్డెమ్మ, నాగిరెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

బి.కొత్తకోట, సెప్టెంబరు 3: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని గట్టు పంచాయతీ తరిగోడుకు చెందిన నాగరాజురెడ్డి ప్రస్తుతం మదనపల్లెలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల తరిగోడులోని తన పొలంలో బోరువేయించాడు. సోమవారం తన స్నేహితుడైన అనపగుట్టకు చెందిన సురేంద్ర(40)తో కలసి ద్విచక్ర వాహనంలో తరిగోడు నుంచి వస్తుండగా కాండ్లమడుగు క్రాస్‌వద్ద హైవేపై మదనపల్లె నుంచి ములకలచెరువు వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన వారిని 108 వాహనంలో మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా సురేంద్ర(40) మార్గమధ్యంలో మృతిచెందాడు., నాగరాజురెడ్డి(41)ని బెంగళూరుకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం సురేంద్ర మృతదేహాన్ని అంగడివారిపల్లెకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. సీఐ రాజారెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

దూషించాడని కేసు నమోదు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 3: ఓ పాడి ఆవు కారణంగా కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శివరామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తవళం పంచాయతీ నాయనవారిపల్లికి చెందిన హేమావతికి చెందిన పాడి ఆవు బత్తల వెంకటరమణ మామిడి తోపులోకి వెళ్లింది. దీంతో వెంకటరమణ తన ఇంటి వద్దకు వచ్చి దూషించాడని హేమావతి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాతకక్షల కారణంగా ఘర్షణ.. కేసు నమోదు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 3: పాతకక్షల కారణంగా దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శివరామకృష్ణ తెలిపారు. తవళం పంచాయతీకి చెందిన యల్లారెడ్డి బస్టాండులో నిలుచుని వుండగా నల్లంవారిపల్లికి చెందిన కృష్ణప్రతాప్, జనార్దన్ కట్టెలతో దాడి చేయడంతో యల్లారెడ్డికి గాయాలయ్యాయి. ఆయన భార్య అన్నపూర్ణ యల్లారెడ్డిని ప్రభుత్వ అసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆమె ఫిర్యాదు మేరకు కృష్ణప్రసాద్, జనార్దన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడికి శ్రేష్ట గురు అవార్డు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు3: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న పఠాన్ మహమ్మద్‌ఖాన్ శ్రేష్ట గురు అవార్డుకు ఎంపికయ్యారు. ఉయ్ సపోర్ట్స్ చారిటబుల్ ట్రస్టు, రేవతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం తిరుపతిలో జరిగే కార్యక్రమంలో మహమ్మద్‌ఖాన్ అవార్డును అందుకోనున్నారు. ఆయన ఇదివరకు సర్వశిక్ష అభియాన్‌లో ఉర్దూ అకడమిక్ మానిటరింగ్ అధికారిగా, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారిగా, ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్తగా కూడా పని చేశారు. బడిబయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించడానికి, మైనార్టీ విద్యార్థులు, ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేశారు. మండల, జిల్లా రాష్ట్రస్థాయిలో రిసోర్స్ పర్సన్‌గా విద్యాశాఖ నిర్వహించే కరదీపికల తెలుగు, ఉర్దూ అనువాద కార్యక్రమాలలో కూడా పాల్గొన్నారు.

10 మంది ఉద్యోగాలకు ఎంపిక

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 3: మదనపల్లె సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 10 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని డైరెక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం బెంగళూరుకు చెందిన టాప్ అకాడమీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. వీరిలో ప్రతిభ చూపిన 10 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, అధ్యాపకులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట

● ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి


పీలేరులో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, సెప్టెంబరు 3: ప్రజాసమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత సమస్యల కంటే సామాజిక సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు, వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నందున పార్టీ శ్రేణులు బాధ్యతగా మెలుగుతూ ప్రజల మన్ననలు చూరగొనేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన పంచాయతీ కార్యదర్శి గురుమోహన్, విద్యుత్ శాఖాధికారులు, పలు హాస్టళ్ల వార్డెన్‌లతో ప్రత్యేకంగా సమావేశమై, ఆయా శాఖల్లో సమస్యలపై వాకబు చేశారు. అంతకుమునుపు ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నేతలు జ్ఞానమూర్తి, జీవీ రవికుమార్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, లడ్డూ జాఫర్, అమరనాథరెడ్డి, నారే సతీశ్, పురం రామ్మూర్తి, లక్ష్మీకర, పోలిశెట్టి సురేంద్ర, శ్రీనాథరెడ్డి, స్పోర్ట్స్ మల్లి, గాండ్ల విజయ కుమార్, ముబారక్, హేమచంద్రారెడ్డి, సాధన, పురం రెడ్డమ్మ, రెడ్డిరాణి, స్వర్ణ, షమ, రమాదేవి, సోనాబాయి, వసంతాల రాజా, ఎస్ఎంసీ ఛైర్మన్ అంజి, గుర్రం నరేశ్, ఖాదర్, శివ, షౌకత్ అలీ, ఖాజా, చాన్‌బాషా, సహదేవ, జనసేన నాయకులు కలప రవి, మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించండి

పీలేరు పట్టణంలో నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలంటూ ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవ కమిటీ, ఎన్టీఆర్ కళాక్షేత్రం సభ్యుడు ఎన్టీఆర్ నఫీస్ ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తెలుగు జాతి కీర్తిని నేల నాలుగు వైపులా వ్యాపింపజేసిన ఎన్టీఆర్ విగ్రహం పీలేరు పట్టణంలో స్థాపించడం స్ఫూర్తిదాయకంగా ఉంటుందని నఫీస్ తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహానికి ఎటువంటి వివాదం లేని స్థలం ఎంపిక చేసి త్వరలోనే అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మహమ్మద్ పీర్, టీడీపీ నేతలు ఫర్హత్, ఇర్షాద్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఐదుగురు వైసీపీ ఎంపీటీసీల మద్దతు

కలికిరి: కలికిరి మండలంలో వైసీపీకి చెందిన ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు టీడీపీకి మద్దతు పలికారు. మంగళవారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని ఆయన ఇంటి వద్ద కలిసి మండలంలో అభివృద్ధి కోసం టీడీపీతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. వీరంతా కిశోర్‌కుమార్ రెడ్డికి శాలువాలు కప్పి సన్మానించారు. ఇలా టీడీపీకి మద్దతు తెలిపిన వారిలో కలికిరి-2 ఎంపీటీసీ సభ్యురాలు భారతి, కలికిరి-3, భోగేష్, కలికిరి-4 రంజిత, మునేళ్ళపల్లె ఎంపీటీసీ సభ్యురాలు షాహీనా, పల్లవోలు ఎంపీటీసీ పి.రమణప్రదీప్ రెడ్డి ఉన్నారు. మండలంలోని టీడీపీ నాయకులతో కలిసి పని చేయాలని ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ రెడ్డి సూచించారు. ఎంపీటీసీలకు అవసరమైన సహకారం తన వద్ద నుంచి అందుతుందని హామీ ఇచ్చారు. కాగా మండలంలో కోఆప్షన్ సభ్యుడితో కలిపి 14 మంది సభ్యులున్నారు. కలికిరి-5 ఎంపీటీసీ రెడ్డివారి గాయత్రి, పత్తేగడ కృష్ణప్ప, మర్రికుంటపల్లె చిరంజీవమ్మ ఇప్పటికే టీడీపీ సభ్యులుగా వున్నారు. వైసీపీ సభ్యుల చేరికతో టీడీపీ బలం 8కి పెరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డివారి యోగేష్ రెడ్డి, సతీష్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

కలికిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు జ్ఞానమూర్తిని మంగళవారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న జ్ఞానమూర్తి ఇంటికి వెళ్ళి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, యోగేష్ రెడ్డి, సతీష్‌కుమార్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, సనావుల్లా, పెద్ద చంద్ర, యల్లయ్య, రాజా, తదితరులున్నారు.

ఇంటింటికి వెళ్లి ఓటరు సర్వే చేయాలి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్


బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమంలో సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 3: బూత్ లెవెల్ అధికారులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఓటరు సర్వే చేయాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో మదనపల్లె మండల బీఎల్‌వోలకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించాలన్నారు. ఓటరు జాబితాలో మృతి చెందిన, వలసవెళ్లిన వారి వివరాలు సేకరించాలన్నారు. పేర్లు తప్పులు వుంటే నిర్దేశిత ఫాంలలో నమోదు చేయాలన్నారు. బీఎల్‌వోలు సర్వేకు వచ్చినప్పుడు ప్రజలు కూడా సహకరించాలన్నారు. కొత్త ఓటర్ల దరఖాస్తుకు అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన అర్హత సర్టిఫికెట్లు బీఎల్‌వోలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

తూకాలు సక్రమంగా ఉండేలా చూడాలి

చౌకదుకాణాల్లో తూకాలు సక్రమంగా వుండేలా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని 36, 37 నెంబర్ల చౌక దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ వున్న బియ్యం, చక్కెర బస్తాలను తూకం వేసి సరిచూసారు. స్టాక్‌ను, రిజిస్టర్‌లో నమోదు చేసిన స్టాకు వివరాలను సరిపోల్చి చూశారు. అనంతరం మాట్లాడుతూ చౌకదుకాణాలకు అలాట్‌మెంట్ ఎంత వుంది, గోదాము నుంచి ఎంత సరఫరా చేశారన్న వివరాలు ఆరా తీశారు. ప్రతి చౌకదుకాణం ఎదుట నోటీసు బోర్డులో వివరాలు నమోదు చేయాలని సూచించారు. చౌకదుకాణ డీలర్లు లబ్ధిదారులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డీటీ రెడ్డెప్ప పాల్గొన్నారు.

నేత్ర దానంతో అంధుల జీవితాల్లో వెలుగు


కలికిరి, వాల్మీకిపురం మండలం చింతపర్తిల్లో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కలికిరి, సెప్టెంబర్లు 3: నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు సాధ్యమవు తుందని మేడికుర్తి వైద్యురాలు డాక్టర్ కావ్యగంధ తెలిపారు. మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీలో మంగళవారం జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నేత్ర దానంపై అవగాహన కల్పించారు. మరణించిన వారి నేత్రాలతో అంధులకు చూపు తెప్పించవచ్చని, దీని కోసం స్వచ్ఛంద సేవా సంస్థలు విరివిగా కృషి చేస్తున్నాయన్నారు. ప్రపంచంలో వున్న అంధుల్లో భారతదేశంలో నాలుగవ వంతు ఉన్నారనేది ఆందోళన కలిగించే విషయమన్నారు. నేత్ర దానం కోసం ముందుగానే నమోదు చేసుకోనవసరం లేదని, మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యుల ఆమోదంతో కూడా నేత్ర దానం చేయవచ్చని వివరించారు. వ్యక్తి మరణించిన ఆరు గంటలలోపు నేత్రాలను వేరుచేస్తే ఇతరులకు అమర్చే అవకాశముం టుందన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం ఆవశ్యకతపై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ, పర్యవేక్షకులు నాగిరెడ్డి, హేమలత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురం: 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నేత్రదానం ప్రాముఖ్యత, కంటి చూపు ఆవశ్యకతలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీవిద్య, జులేఖాబేగం, హెల్త్‌ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, సూపర్‌వైజర్లు సుధాకర్, బానుబీ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బాసట

● రూ. 3 లక్షల విలువైన నిత్యావసరాలు, రెండు వేల బ్రెడ్లు తరలింపు


విజయవాడకు నిత్యావసర సరుకులు తరలిస్తున్న జిట్టా వెంకటరమణ తదితరులు


వరద బాధితులకు బ్రెడ్లు పంపిస్తున్న మదనపల్లె శేఖర్ స్వీట్స్ యాజమాని

పెద్దమండ్యం, ఆగస్టు 3: వరద బాధితుల సహాయార్థం మంగళవారం వేకువ జామున తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ నేతలు రూ. 3 లక్షలు విలువ చేసే కూరగాయలు, బిస్కెట్లు తదితరాలను విజయవాడకు తరలించారు. మండల టీడీపీ అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ, ములకలచెరువు నేత పాలగిరి సిద్దా, పీటీఎం ఆనంద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనాథ్ రెడ్డి, నారాయణస్వామిరెడ్డి, కుదుమ శ్రీనివాసులు, రాజంపేట పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నటరాజ్‌నాయక్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, రమణ, ఈశ్వరప్ప, చెన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శేఖర్ స్వీట్స్ ఆధ్వర్యంలో...

మదనపల్లె అర్బన్: ఏపీలో వరద బాధితులకు అన్నమయ్యజిల్లా మదనపల్లె పట్టణంలోని శేఖర్ స్వీట్స్ యజమానులైన పెరుమాళ్ ముత్తుస్వామి, పెరుమాళ్ బాలసుబ్రహ్మణ్యం, పెరుమాళ్ మమత తమ సొంత వాహనంలో రెండు వేల బ్రెడ్లులు విజయవాడకు తరలించి ప్రభుత్వం ద్వారా బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ముత్తుస్వామి మాట్లాడుతూ వరదల్లో చిక్కుకున్న వారి ఆకలి తీర్చడానికి తమవంతు సాయం చేశామన్నారు. వరద బాధితులకు అందరూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. శేఖర్ స్వీట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

● డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు3: వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని మదనపల్లె డీఎస్పీ డి.కొండయ్యనాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో మట్టి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. మండపాల నిర్వాహకులు ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలు పాటించాలని, విద్యుత్ శాఖ అనుమతి తప్పక పొందాలన్నారు. వివాదాస్పద స్థలాల్లో మండపాలను ఏర్పాటు చేయకూడదని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. బలవంతంగా చందాలు వసూలు చేయరాదన్నారు. లౌడ్‌స్పీకర్లు ప్రతిరోజు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లో వినియోగించరాదన్నారు. అశ్లీల నృత్యాలు, ప్రదర్శనలు నిర్వహించరాదన్నారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా, టూటౌన్ సీఐ రామచంద్ర, రూరల్ సీఐ రమేష్, తాలుకా సీఐ కళా వెంకటరమణ, విజయభారతి స్కూల్ ప్రిన్సిపాల్ సేతు, పీస్‌కమిటీ సభ్యులు బండి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : ఎస్ఐ ఎం.కె. నరసింహుడు మాట్లాడుతూ ప్రతిమల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, మార్గం, నిమజ్జనానికి ఉపయోగించే వాహనం తదితర వివరాలను విధిగా తెలియ చేయాలన్నారు. రోడ్లపై ఎట్టి పరిస్థితుల్లోనూ మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు.

బ్యానర్లు, ప్లెక్సీలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వినాయక మండపాల వద్ద డీజే సౌండ్ పరిమితంగా ఉండాలని, మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కమిటీ నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మట్టితో చేసిన గణపతి విగ్రహాలను ఉప యోగించి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

ఆర్టీసీ కడప రీజియన్ ఆదాయం రోజుకు రూ.6.50 కోట్లు

● ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి


పీలేరు బస్టాండులో సౌకర్యాలను పరిశీలిస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి

పీలేరు, సెప్టెంబరు 3: కడప జోన్ పరిధిలో ఆర్టీసీ ఆదాయం రోజుకు రూ.6.50 కోట్లు వస్తున్నట్లు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పీలేరు, కలకడ ఆర్టీసీ బస్టాండులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జోన్ పరిధిలో ప్రతి రోజు 4,415 బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. దీంతో ఆర్టీసీకి ప్రతి రోజు ఆదాయం రూ.6.50 కోట్లు వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి కొత్త బస్సులను ఇస్తుండడంతో ఆదాయం పెరుగుతుందన్నారు. కార్గో సేవలను పెంచి ఆదాయం పెంచుతామన్నారు. ఆర్టీసీ డిపోలో ప్రజలకు మెరుగైన సేవలను అందిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బస్టాండులో మరుగుదొడ్లు, క్యాంటీన్, దుకాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎం కుమార్, బాబునాయక్‌లు పాల్గొన్నారు.

కురవంక ఆక్రమణలను తొలగించండి


కురవంక ఆక్రమణలపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 3: కురవంక ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. మంగళవారం మదనపల్లె మండలం కురవంక పంచాయతీలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా పలు చోట్ల కురవంకను పూడ్చివేసి ఇండ్లు నిర్మించడంపై స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ ఆక్రమణలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వెంటనేఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్ ఖాజాబీని, వీఆర్‌వోను ఆదేశించారు. అనంతరం జనచేతన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటెన్సిఫైడ్ ర్యాలీలో మాట్లాడుతూ యువతలో హెచ్ఐవీపై చైతన్యం తీసుకురావాలన్నారు. దీనిపై ఎవరికైనా సందేహాలు వుంటే 1097 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

అంటు వ్యాధులపై అవగాహన కల్పించాలి

ములకలచెరువు, సెప్టెంబరు 3: ప్రజలకు అంటువ్యాధులపై అవగాహన కల్పించాలని మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్‌బాబు సూచించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరపీడితులను త్వరగా గుర్తించి రక్త పరీక్షలు చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటింటికి తిరిగి మురుగుగుంటల్లో బ్లీచింగ్, ఆయిల్ బాల్స్‌ను వేయించాలన్నారు. జ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ జాహ్నవి, సూపర్‌వైజర్లు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వితరణ


భోజనం వడ్డిస్తున్న జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్

ములకలచెరువు, సెప్టెంబరు 3: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా గ్రామానికి చెందిన శివశంకర్, రేజామండలంలోని వేపూరికోట ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు షోరూం సూరి, నూకరాజు, సుదర్శన్, పవన్‌రెడ్డి, అంజి, రమణ, అరుణ్, మల్లికార్జున, రాజశేఖర్ తది తరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

ములకలచెరువు, సెప్టెంబరు 3: మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పోలప్ప హెచ్చరించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటకాలను పరిశీలించి నాణ్యతపై విద్యారుథలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ కచ్చితంగా పాటించాలన్నారు. ఎంఈవో వెంకటరమణ, హెచ్ఎం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 3: మండలంలోని వికలాంగులను ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు, స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలని మంగళవారం తహసీల్దార్ ధనంజయులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి పని చేయలేక ఇతరుల మీద ఆధారపడి బతుకుతున్నామని తెలిపారు. తమకు ఇళ్లు కేటాయించాలని గతంలో పలువురు నాయకులు, అధికారులకు విన్నపాలు చేసినా ఫలితం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమను ఆదుకొని వికలాంగులకు కాలనీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంజునాథ్, శ్రీనివాసులు, రాజన్న, బాషా, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 3: సర్వజన బోధనాస్పత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వెంటనే వేతనాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు టి.కృష్ణప్ప డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ కార్మికులతో కలసి సీపీఐ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ ఆస్పత్రిలో జీడీఏలుగా, ఓటీ అసిస్టెంట్లుగా, ఆఫీసు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 26 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 13 నెలలుగా వేతనాలు అందలేదన్నారు. దీంతో పాటు మరికొంత మందికి 8 నెలలుగా వేతనాలు మంజూరు చేయలేదన్నారు. దీనిపై మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు, డీసీహెచ్‌కు పలుమార్లు వినతులు ఇచ్చినా కార్మికులకు న్యాయం జరగలేదన్నారు. అందుకే ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అమరావతి, ఉమా, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 27 మంది ఎంపిక

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 3: మదనపల్లె జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 27 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఓబులేశు తెలిపారు. మంగళవారం స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని ప్రభుత్వ మోడర్న్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో డీఈవో దోనప్ప ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో ఐదు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు 60 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో 27 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, వారికి నెలకు రూ.13 నుంచి రూ.25వేలు వేతనం వస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 3: పౌష్టికాహారంతో రక్తహీనతను నిర్మూలించవచ్చని సీడీపీవో సుజాత తెలిపారు. మంగళవారం స్థానిక ఇందిరానగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, బాలికలు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీని కోసం మునగాకు, ఖర్జూర దానిమ్మ పండ్లు తినడంతో పాటు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలన్నారు. డాక్టర్ ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ చిన్నారులకు సీజనల్ వ్యాధులు వేగంగా ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామాలకు వచ్చే 104 వైద్య సిబ్బందితో వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీపీవో కళ్యాణి, సూపర్‌వైజర్లు చంద్రకాంత, శాంతమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో అధికారుల సర్వే


వివాదాస్పద స్థలాన్ని సర్వే చేస్తున్న రెవెన్యూ, ఆర్అండ్ బీ అధికారులు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 3: ప్రభుత్వ స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారక నాథ్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని ఆహ్వానించాలని మద్దయ్యగారిపల్లెకు చెందిన వైసీపీ నేత హరి ప్రయత్నాలను పోలీసులు ఆదివారం అడ్డుకున్న విషయం తెలిసిందే. మంగళవారం ఆ స్థలంలో రెవెన్యూ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు సర్వే చే శారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని , సర్వే పూర్తయిన తర్వాత ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని ఆర్ అండ్ బీ ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

బీసీ హాస్టల్‌లో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 3 : మండలకేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో కెఎన్. బాలాజీ మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పరిసరాలను, వంటగది, పారిశుధ్య నిర్వహణ తదితరాలను పరిశీలించారు. హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు ఉండగా, 22 మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో బోజనం రుచి, మెనూ అమలుతోపాటు, హాస్టల్‌లోని సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, చదువుపై దృష్టి పెట్టి బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను ఆయన కోరారు.

మాజీ సీఎంను కలసిన వైసీపీ నాయకులు


నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

వాల్మీకిపురం, సెప్టెంబరు 3: పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు పఠాన్‌ఖాదర్‌వలి, వీరంరెడ్డి తదితరులు మంగళవారం మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కలికిరి బీజేపీ కార్యాలయంలో కలిశారు. శాలువాతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరనున్నట్లు తెలిపారు.